
# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 11 సంచిక: 271 సోమవారం 21-04-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


పంజాబ్ ను చిత్తు చేసిన
## ఆర్సీబీ
8లో..



# మరి వాటి సంగతేంటి సీఎం సార్?






- నిబంధనలు పాటించని హాస్పిటళ్లపై చర్యలుండవా?
- అమాయకుల ప్రాణాలతో చలగాటమాడుతున్న యాజమాన్యాలు
- అధికారుల అండతో రెచ్చిపోతున్న ఆస్పత్రులు!
- వాటిపై చర్యలు తీసుకునేదెప్పుడు?
- సర్కార్‌పై మండిపడుతున్న ప్రజాసంఘాలు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(ఏప్రిల్ 20):** ప్రైవేట్ ఆస్పత్రుల అక్రమాలపై రేవంత్ సర్కార్ కొరడా ఝులిపించింది. సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు రద్దు చేసింది. ప్రజా ధనాన్ని అప్పనంగా దోచుకు తింటున్న ఆస్పత్రుల యాజామాన్యాల పై సీరియస్‌గా ఫోకస్ చేసిన ప్రభుత్వం.. ఈ భారీ కుంభకోణంలో భాగస్వాములైన నిందితులపై కఠిన చర్యలకు దిగింది. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం చర్యలు చేపట్టిన సర్కార్.. తక్షణమే దీనిని అమలు చేయాలని సంబంధిత జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించింది. ఖమ్మం జిల్లాలో 10, రంగారెడ్డి జిల్లాలో 6, హైదరాబాద్‌లో 4, నల్గొండలో 3, మహబూబాబాద్‌లో 2, కరీంనగర్, పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో ఒక్కో

మిగతా 2వ పేజీలో..



## హైదరాబాద్‌లో త్వరలో ఎకో టౌన్

- జపాన్‌తో ప్రభుత్వం ఒప్పందం
- నగరానికి పెరగనున్న మౌలిక సదుపాయం

5



## బెంగళూరులో మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ హత్య

- భార్యపై అనుమానాలు
- కుటుంబ కలహాలే కారణమా?

3

## టీమ్ శివంగి రెడీ



- రాష్ట్రంలో తొలి మహిళా కమాండో బృందం
- దళాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

2



## దుర్గమ్మ మంగళ సూత్రాలు చోరీ

జర్నలిస్ట్ డైరీ, కాకినాడ(ఏప్రిల్ 20): రోజురోజుకూ దొంగలు పేట్రేగి పోతున్నారు. భయం భక్తి ఏ కోశాన కనపడటం లేదు. ఆలయాల్లో నిర్భయంగా చోరీలకు పాల్పడుతున్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పి.అగ్రహారం వలసపాకలలో చోరీ జరిగింది. దుర్గమ్మ గుడి తాళం పగలకొట్టి లోపలికి దొంగ చొరబడ్డాడు. అమ్మవారి మెడలో ఉన్న మూడు జతల బంగారు సూత్రాలు, వెండి కిరీటం ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యాలు గుడి సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఆలయాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగ కోసం గాలిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌లో దొంగతనం దృశ్యాలు క్లియర్‌గా కనిపిస్తుండటంతో దొంగను గుర్తించడం పెద్ద కష్టంకాదని అంటున్నారు. త్వరలో కేసును ఛేదిస్తామని పోలీసులు తెలిపారు.



ఎంఐఎం లేకపోతే
## కాంగ్రెస్ బతకలేదు

- అసద్‌కు లొంగిపోయిన బీఆర్ఎస్
- మద్దతు ఇచ్చేందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం
- రానున్న ఎన్నికల్లో జరిగేది సిద్ధాంతపర యుద్ధమే
- మీడియా సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

2



## దక్షిణ తెలంగాణకు వర్ష సూచన

- వాతావరణ శాఖ హెచ్చరిక
- అలర్ట్ గా ఉండాలని సూచన

6



## హిజ్రాల వికృత చేష్టలు

- డబ్బులు ఇవ్వాలంటూ రచ్చ రచ్చ
- యజమానులపై బూతులతో రెచ్చిపోయిన వైనం
- రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో ఘటన

2

## అభిమానానికి కృతజ్ఞతలు



- భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత
- పేదలను స్వర్ణ కుటుంబాలుగా మార్చాలి
- సీఎం చంద్రబాబు కామెంట్స్

5



# టీమ్ శివంగి రెడీ


**జర్నలిస్ట్ డైరీ, ఆదిలాబాద్(ఏప్రిల్ 20):**
మహిళా కమాండోలను రేవంత్ సర్కార్ సిద్ధం చేసింది. రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళా కమాండో బృందాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దక్కించుకున్నారు. ఈ బృందానికి 'టీం శివంగి'గా నామకరణం చేస్తూ మంత్రి సీతక్క చేతుల మీదుగా దళాన్ని ప్రారంభించారు. ఆదివారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క తెలంగాణలోని మొట్టమొదటి మహిళా కమాండో బృందం నిర్మల్ జిల్లాలో ఆరంభిస్తూ.. ఇకపై అన్ని జిల్లాల్లో మహిళా కమాండో బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళా పోలీసుల్లో ఔత్సాహికులకు 45 రోజుల కఠిన శిక్షణనిచ్చి కమాండో బృందాన్ని తయారు చేసినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. బృందంలోని కమాండోలకు ఆయుధాలు, టెక్నాలజీ వంటి తదితర అంశాలపై ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. కాగా మహిళలకు అన్ని రంగాల్లో తొలి ప్రాధాన్యత కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను మరోమారు నిలబెట్టుకున్నారని బృంద సభ్యులు తెలియజేశారు. ఇకపై ప్రత్యేక భద్రతా దళంలో పురుషులే కాదు, మహిళలు కూడా కనిపించనున్నారు.

# హిజ్రాల వికృత చేష్టలు



రంగారెడ్డి జిల్లాలోని గుర్రంగూడలో హిజ్రాలు రెచ్చిపోయారు. వికృత చేష్టలతో రచ్చ రచ్చ చేశారు. రాచకొండ సీపీ పరిధిలోని గుర్రంగూడలో ఆదివారం ఓ భూమి పూజ జరగ్గా అక్కడకు కొందరు హిజ్రాలు చేరుకున్నారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోవడంతో వికృత చేష్టలు చేస్తూ యజమానులను బూతులు తిట్టారు. హిజ్రాలు దౌర్జన్యం చేసిన వీడియోను ఓ నెటిజన్ సోషల్ మీడియాలో షేర్ చేశాడు. రాచకొండ సీపీని ట్యాగ్ చేస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. హిజ్రా సంఘాలకు కౌన్సిలింగ్ నిర్వహించి శుభకార్యాల పూట ప్రజలు సంతోషంగా ఉండేలా చూడాలని కోరారు. ఈ అసభ్యకర పోకడకు ముగింపు పలకాలని కోరారు. నెటిజన్ పోస్టుకు రాచకొండ సీపీ స్పందించారు. మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరగడంతో వారిని ట్యాగ్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి మీర్ పేట్ పోలీసులు రిప్లై ఇస్తూ అక్కడకు పోలీసులు వెళ్లారని సమస్య పరిష్కారం అయిందని పేర్కొన్నారు. కానీ నెటిజన్ పోలీసులు అబద్ధం చెబుతున్నారని అసలు అక్కడకు ఎవరూ వెళ్లలేదని ఘటనపై కేసు నమోదు చేసుకోలేదని మరోసారి సీపీకి ఫిర్యాదు చేశారు.

## ఎంఐఎం లేకపోతే
# కాంగ్రెస్ బతకలేదు



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(ఏప్రిల్ 20):**
ఎంఐఎం పార్టీకి సెక్యూలర్, అంబేద్కర్ అనే పదాలు వాడే హక్కుందా అని చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. అలాగే యాంటీ సెక్యూలర్ పార్టీ అయిన ఎంఐఎంకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం కరెక్టేనా అని, ఎంఐఎంకు మద్దతు ఇస్తున్న టీఆర్ఎస్/బీఆర్ఎస్ పార్టీ వాళ్లు సెక్యూలర్ అనే పదం వాడే హక్కుందా అని నిలదీశారు. అసదుద్దీన్ కు లొంగిపోయి, ఎంఐఎంకు మద్దతు ఇచ్చేందుకేనా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో నిలబడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం లేకుంటే బతకలేదని అందుకే వారికి లొంగిపోయారని అన్నారు. బీజేపీ పార్టీతో పోరాడేందుకు మూడు పార్టీలు కుమక్కు అయ్యాయని, ఈ ఎన్నికల్లో జరిగేది సిద్ధాంతపరమైన యుద్ధమని అన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. ప్రత్యర్థి పార్టీలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీతో పోటీ పడేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు అయ్యాయని వ్యాఖ్యానించారు.

ఒక మతం కాదు.. దేశం గురించి ఆలోచించడమే సెక్యూలర్ భావజాలం అని అంబేద్కర్ చెప్పారని, ఎంఐఎం కు మద్దతు ఇస్తున్న బీఆర్ఎస్ కాంగ్రెస్ లకు సెక్యూలర్ అనే పదం వాడే హక్కు లేదని అన్నారు. శనివారం జరిగిన ఓ మీటింగ్ లో ఎంఐఎం నేత అసదుద్దీన్ మోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, కేసీఆర్ తో పొత్తు ఉండి ఆయన కూడా అదే భాష వాడుతున్నారని చెప్పారు. ఆయన ఏం భాష మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని, ఆయన చదువుకున్న చదువు ఇదేనా అని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం బీజేపీ చేస్తున్న కార్యక్రమాలు అన్నింటికీ కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకంగా ఉన్నాయని ఆరోపించారు. ఇక బీఆర్ఎస్ వాళ్లని ఎన్నికల్లో ఓటు వేయొద్దని పార్టీ పెద్దలు చెబుతున్నారని, వాళ్లు ఇంట్లో కూర్చొని ఎంఐఎంకు మద్దతు ఇస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. చదువుకున్న వాళ్లంతా ఓటు వేసే ముందు ఆలోచించాలని, నిజంగా సెక్యూలర్ భావజాలం ఉంటే, దేశ భక్తి ఉంటే, భారతీయులు అందరూ ఒక్కటే అనుకుంటే ఆత్మ పరిశీలన చేసుకొని ఓటు వేయాలని సూచించారు. అలా ఓటు వేస్తే బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావు కచ్చితంగా గెలుస్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో జరిగేది సిద్ధాంతపరమైన యుద్ధమని, ఒక మతతత్వ పార్టీకి, సెక్యూలర్ పార్టీకి జరుగుతున్న యుద్ధమని, అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎంపీ అన్నారు.

# మరి వాటి సంగతేంటి సీఎం సార్?

మొదటి పేజీ తరువాయి






ప్రైవేట్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దయ్యింది. గత ఏడాది సీఐడీ ఈ కేసును టేకప్ చేయగా, విచారణలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల పాత్ర ఉందని తేలింది. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆయా ఆసుపత్రులను వైద్యారోగ్య శాఖ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. తాజాగా వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేసి సంచలనం సృష్టించింది. సర్కార్ తాజా చర్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల గుండె గుభేలుమన్నది. అవినీతి దారిలో నడుస్తూ, అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ యాజమాన్యాలపై సర్కార్ చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయం ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు కూడా ఒక హెచ్చరికగా నిలుస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇకపై ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడాలంటే భయపడాలని, కఠిన చర్యలు తీసుకుంటారనే సోయి వారికి ఉండాలని అంటున్నారు. ఆరోగ్య రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు. అయితే ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన ఆస్పత్రులు మరిన్ని ఉన్నాయి. కేవలం సీఎంఆర్ఎఫ్ మాత్రమే కాకుండా, ఇన్సురెన్స్ డబ్బులను దోచుకుంటున్న ఆస్పత్రులు, నకిలీ వైద్యులతో మేనేజ్ చేస్తున్నవారు, నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అమాయకుల ప్రాణాలతో చలగాటమాడుతున్న ఆస్పత్రుల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పూర్తి స్థాయిలో అనుమతులు తీసుకోకుండానే, తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నాయి. సెల్లార్‌లో ఎమర్జెన్సీ వార్డులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నాయి. ఈ వ్యవహారంపై జర్నలిస్ట్ డైరీ, ఎస్‌వీ 6 న్యూస్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో పలు ఆస్పత్రుల డొల్లతనం బయటపడింది. వాటికి సంబంధించిన ఆధారాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ప్రయోజనం శూన్యం. హెల్త్ డిపార్ట్ మెంట్‌లోని అధికారుల అండతోనే ఇదంతా జరుగుతుందని, వారు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతోనే ప్రైవేట్ యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయని అంటున్నారు. ఆ అవినీతి అధికారుల భరతం పట్టాలని, వైద్య రంగాన్ని గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాజకీయ, అధికార అండదండలతో రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా భరతం పట్టాలని ప్రజాసంఘాల నేతలు అంటున్నారు. ప్రజా చైతన్యంతోనే ఇది సాధ్యమవుతుందని చెబుతున్నారు.

# ఏపీ ఎంపీల్లో విజయనగరమే టాప్



**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ(ఏప్రిల్ 20):**
ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులో తెలుగుదేశం పార్టీ నుంచి 16, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు, బిజెపి నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఇద్దరు ఉన్నారు. అయితే వీరు పార్లమెంటుకు హాజరవుతున్న తీరు, సభలో వారు లేవనెత్తుతున్న ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనడం పై ఓ రిపోర్టు విడుదలైంది. ఎంపీల పనితీరుపై పిఆర్ఎస్ ఇండియా సమాచారం సేకరించింది. 18వ లోక్సభ బడ్జెట్ సమావేశాలు ఇటీవల ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రిపోర్టు నివేదికను బయటపెట్టింది పిఆర్ఎస్ ఇండియా. ఎంపీల హాజరు విషయానికి వస్తే.. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ 99% పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్ 97%, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు 93% తో రెండు మూడు స్థానాల్లో ఉన్నారు. హాజరులో ముందున్నది వీరే పార్లమెంటుకు 90 శాతానికి పైగా హాజరైన వారిలో ఏడుగురు ఎంపీలు ఉన్నారు. వారిలో కలిసెట్టి అప్పలనాయుడు, జీఎం హరీష్, శ్రీ భరత్, దగ్గుమల్ల ప్రసాదరావు, బస్తీపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ ఉన్నారు. అయితే వీరంతా తొలిసారిగా ఎంపీలుగా ఎన్నికైన వారే. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ అవినాష్ రెడ్డి 54% హాజరుతో చివరి స్థానంలో ఉన్నారు.లోక్సభలో ప్రశ్నలు వేయడంలో సైతం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన ఏకంగా 89 ప్రశ్నలు వేసి రికార్డు సృష్టించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి 84 ప్రశ్నలతో రెండవ స్థానంలో నిలిచారు. చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ 82 ప్రశ్నలు వేసి మూడో స్థానంలో నిలిచారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అత్యల్పంగా 22 ప్రశ్నలు అడిగారు.లోక్సభలో విషయానికి వస్తే తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు 22 చర్చల్లో పాల్గొని టాప్ గా నిలిచారు. వైయస్సార్సీపీకి చెందిన తిరుపతి ఎంపీ గురుమూర్తి 19 చర్చలతో రెండవ స్థానంలో నిలిచారు. జనసేన కు చెందిన మచిలీపట్నం ఎంపీ బాలసౌరి 18 చర్చలతో మూడో స్థానంలో ఉన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి మాత్రం కేవలం ఒకే చర్చలో మాత్రమే పాల్గొన్నారు. అయితే ఏపీ నుంచి 25 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ ఏపీ సమస్యలపై వారు ప్రశ్నించడం లేదన్న విమర్శ ఉంది. అయితే పార్లమెంటుకు ఎన్నికైన వారు మాత్రం హాజరు వేసుకోవడం, ప్రశ్నలు వేయడం, చర్చల్లో పాల్గొనడం లో ముందు వరుసలో నిలవడం విశేషం.

# ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్, (ఏప్రిల్ 19)**
గతంలో ఎంబీబీఎస్ పాఠ్యపుస్తకాలు, మెడికల్ విద్యను ప్రాంతీయ భాషల్లో ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఇంజినీరింగ్ విద్యలోనూ పలు మార్పులు చేసేందుకు కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగా ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ప్రాంతీయ భాషల్లో అందించడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చర్యలు చేపడుతోంది. స్థానిక భాషల్లో ఇంజినీరింగ్ పాఠ్య పుస్తకాలను అందించడానికి కసరత్తు చేస్తోంది. వివిధ విభాగాల్లో ఇప్పటికే కార్యచరణ ప్రారంభించారు కూడా. తద్వారా ప్రాథమిక, హైస్కూల్ విద్యను మాతృభాషలో చదువుకుని ఇంజినీరింగ్‌లో ఆంగ్లమాధ్యమంతో ఇబ్బందులు పడుతున్న వారు స్థానిక భాషలోనే చదువుకుని అర్థం చేసుకునేందుకు వీలుకల్పిస్తోందని ఓ ఇంటర్వ్యూలో AICTE చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం తెలిపారు. మొదటి, రెండవ సంవత్సరం ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సులకు సంబంధించిన దాదాపు 600 పాఠ్యపుస్తకాలను ఇప్పటికే 12 ప్రాంతీయ భాషలలో తయారు చేసి అప్‌లోడ్ చేశామని చెప్పారు.

# ఏపీకి గేమ్ ఛేంజర్ ప్రాజెక్ట్

- **రియో టింటోతో చర్చలు**

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ, (ఏప్రిల్ 20):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్టు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కొన్ని కీలక పెట్టుబడులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టు కూడా ఏపీకి వస్తుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మైనింగ్ సంస్థ అయిన రియో టింటో.. గురువారం భారత్‌కు చెందిన ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మన దేశంలో లోకార్బన్ అల్యూమినియం ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఈ ఎంవోయూ జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ సంస్థను రెండు సంస్థలు ప్రమోట్ చేస్తున్నాయి. గ్రీన్‌కో, ఏఎం గ్రీన్ కలిసి దీనిని ఏర్పాటు చేశాయి.మరోవైపు అల్యూమినియం ప్లాంట్ ఏర్పాటు ద్వారా పదేళ్ల తర్వాత రియో టింటో భారతదేశంలోకి మళ్లీ అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రతిపాదిత అల్యూమినియం ప్లాంట్ ద్వారా ఏడాదికి ఒక మిలియన్ టన్నుల ప్రైమరీ అల్యూమినియం, 2 మిలియన్ టన్నుల అల్యూమినా ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఈ రెండూ గాలి, సౌర శక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా శక్తిని పొందుతాయి. ఈ ప్రాజెక్టు తొలి దశలో 5 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని ఓ పోర్టు సమీపంలోని ప్రాంతంపైనా ఫోకస్ పెట్టినట్లుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం 42 వేల నుంచి 58 వేల కోట్ల వరకూ పెట్టుబడి పెట్టొచ్చని వార్తలు వస్తున్నాయి.మరోవైపు అల్యూమినియానికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. తేలికగా ఉండటం, రీసైక్లింగ్ చేయడానికి అనువుగా ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ ఉంది. ముఖ్యంగా ఆటో, నిర్మాణ రంగంలో అల్యూమినియానికి ఎక్కువ డిమాండ్ ఉంది. మరోవైపు అల్యూమినియం ఉత్పత్తిలో మనదేశం రెండో స్థానంలో ఉంది. ఇక ఏపీకి సంబంధించి గ్రీన్ హైడ్రోజన్ రంగంలో కీలక ప్రాజెక్టులు వస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన కూడా చేసిన సంగతి తెలిసిందే. అలాగే బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రానున్నాయి.

# లిక్కర్ లెక్కలు తేల్చేస్తామంటున్న సర్కార్

కసిరెడ్డి... క్రిమినల్ అంటున్న విజయసాయి





జర్నలిస్ట్ డైరీ, విజయవాడ(ఏప్రిల్ 20): ఏపీలో గత వైసీపీ సర్కార్ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై కూటమి ప్రభుత్వం దానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను స్పీడప్ చేస్తోంది. ఈ స్కాంలో ఎవరున్నా..ఎంతమంది ఉన్నా వారందరిని బయటకు లాగేందుకు ఇప్పటికే ఏర్పాటైన సిట్ విచారణను స్పీడప్ చేసింది. అందులో భాగంగానే సిట్ విచారణకు హాజరు కావాలంటూ వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఇప్పటికే సిట్ నోటీసులు జారీ చేసింది.మద్యం కుంభకోణంలో శుక్రవారం విచారణకు రావాల్సిందిగా ఏపీ సిట్ నోటీసులు జారీ చేయడంతో మిథున్ రెడ్డి వెంటనే హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా న్యాయవాదిని అనుమతించాలని, వీడియో రికార్డింగ్ చేసేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. మిథున్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు విచారించింది. అంతకు ముందు కూడా ఇదే కేసులో తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఎంపీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే దీన్ని హైకోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత ఎంపీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో పాటు విచారణకు సహకరించాలని ఎంపీని ఆదేశించింది.

మరోవైపు ఈ కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కర్త, కర్మ, క్రియ కసిరెడ్డే అంటూ కొద్ది రోజుల క్రితం మీడియా ముందే సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.లిక్కర్ స్కాంలో తనకు తెలిసిన వివరాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు సాయిరెడ్డి చెప్పడంతో సిట్ విచారణలో ఎలాంటి విషయాలు బయటపెడతారన్న ఉత్కంఠ ఉంది. సాయిరెడ్డిని విచారించేందుకు సిట్ సిద్ధంగా ఉన్నా...గురువారం హాజరుకాలేదు. మరోసారి వస్తానని చెప్పిన విజయసాయిరెడ్డి ఎప్పుడొస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే సాక్షిగా విజయసాయి చెప్పే అంశాలు మద్యం కుంభకోణం కేసులో కీలకం అవుతాయని సిట్ అధికారులు భావిస్తున్నారట..వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకున్నారని ఇప్పటికే నిర్ధారణ అయిందని ఓ టాక్ నడుస్తోంది. దీనిపై విచారణ జరిపిన సిట్..పలు కీలక ఆధారాలను కూడా సేకరించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం మొత్తానికి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి సూత్రధారి అని, ఆయన కనుసన్నల్లోనే మద్యం కుంభకోణం నడిచిందని సిట్ ఓ నిర్ధారణకు వచ్చిందట. ఇప్పటికే మూడు సార్లు విచారణకు రావాల్సిందిగా కసిరెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసినా మూడు సార్లు కూడా విచారణకు డుమ్మా కొట్టారు.అంతేకాకుండా కసిరెడ్డి ఫోన్లు కూడా స్విచ్ఆఫ్ చేయడంతో ఆయన కుటుంబ సభ్యులను కలిసి నోటీసులు ఇచ్చారు. అలాగే కసిరెడ్డి తండ్రికి కూడా సిట్ నోటీసులు జారీ చేసింది. గత ఐదేళ్లలో మద్యం ద్వారానే కసిరెడ్డి అక్రమంగా ఆస్తులను సంపాదించారని సిట్ ఇప్పటికే గుర్తించిందట. ఆ డబ్బు ద్వారానే అనేక సంస్థల్లో పెట్టుబడులు పెట్టారని, సినిమా కూడా తీశారని సిట్ అధికారులు చెప్తున్నారు. దీంతో ఈ కేసులో మరింత లోతుగా విచారించేందుకు సిట్ రెడీ అవుతోంది. లిక్కర్ స్కాంలో ఉన్న పాత్రధారులు, సూత్రధారులు ఎవరనేది త్వరలోనే బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కసిరెడ్డి క్రిమినల్**
రాజ్ కసిరెడ్డి తెలివైన క్రిమినల్ అని విజయసాయి రెడ్డి ఆరోపించారు.రాజ్ కసిరెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన తెలివైన క్రిమినల్ అని.. ఆయన తనను మోసం చేశారన్నారు. తాను రాజ్ కసిరెడ్డికి అరబిందో నుంచి వంద కోట్ల రూపాయలు అప్పుగా ఇప్పించానన్నారు. రాజ్ కసిరెడ్డి మూడు కంపెనీలు పెట్టి లిక్కర్ తయారు చేశారన్న విషయం తనకు తెలియదు కానీ.. అందులో రెండు కంపెనీలకు మాత్రం వంద కోట్లు ఇప్పించానన్నారు. పన్నెండు శాతం వడ్డీకి చెల్లింపులు జరిగేలా ఈ అప్పు ఇప్పిచానని చెప్పారు. రాజ్ కసిరెడ్డిని తనకు పార్టీ నేతలే ప్రచారం చేశారని.. ఆయనను తాను ప్రోత్సహించి తప్పు చేశానన్నారు. లిక్కర్ పాలసీకి సంబంధించి తన ఇంట్లో రెండు సమావేశాలు జరిగాయని.. విజయసాయిరెడ్డి సీఐడీ అధికారుల ఎదుట అంగీకరించారు. ఆ సమావేశాల్లో రాజ్ కసిరెడ్డి, మిథున్ రెడ్డి కూడా పాల్గొన్నారని తెలిపారు. అయితే లిక్కర్ విక్రయాల అంశంలో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదన్నారు. దుర్మార్గమైన రాజ్ కసిరెడ్డి చేతిలో మోసపోయానని బాధపడుతున్నాన్నారు. రాజ్ కసిరెడ్డి వసూలు చేసినవి ఎవరికి వెళ్లాయో తనకు తెలియదన్నారు. రాజ్ కసిరెడ్డి మాత్రమే అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పగలరని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు.లిక్కర్ స్కాంలో బిగ్ బాస్ ఉన్నాడో లేడో తనకు తెలియదన్నారు. విచారణలో అధికారులు లంచాల గురించి అడిగారని.. తనకు తెలియదని చెప్పానని తెలిపారు.

రెండు కంపెనీలకు సిఫారసు చేశానని చెప్పానని.. ఒకరికి రూ.60 కోట్లు, మరొకరికి రూ.40 కోట్లు ఇచ్చారని చెప్పానని వెల్లడించారు. రుణం మాత్రమే ఇప్పించానని.. నిధుల వినియోగం గురించి తెలియదని చెప్పానని పేర్కొన్నారు. సిట్ అధికారులు తనను అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పానన్నారు. మరో సారి పిలిచినా వస్తానన్నారు. మరోసారి ఆయన జగన్ కోటరీపై విరుచుకుపడ్డారు. తాను నెంబర్ టు స్థానంలో ఉండేవాడినని.. తర్వాత రెండు వేల స్థానానికి పడిపోయానన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనది రెండో స్థానమని అధికారంలోకి వచ్చాక ఆ స్థానం మిథ్య అని తేలిందని నిరాశ వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో లేనప్పుడు అన్నీ తానే చూసుకున్నానన్నారు. తాను వెన్నుపోటుదారుడినని జగన్‌కు చెప్పారన్నారు. కోటరీ వల్లే తాను పార్టీని వీడానని చెప్పుకొచ్చారు. తాను వేల కోట్లు దోచుకున్నానని జగన్ కు చెప్పారని మండిపడ్డారు. వైసీపీకి చెందిన మీడియాలో తనపై వస్తున్న వార్తలపైనా విజయసాయిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సాక్షి పత్రికను తానే పెట్టించానని ఇప్పుడు ఆ పత్రికలో తనపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బీజేపీ తరఫున రాజ్యసభ స్థానం అడగలేదన్నారు. రాజకీయాల్లో లేనని.. ప్రజలు కోరుకుంటే రాజకీయాల్లోకి వస్తానని వ్యాఖ్యానించారు. ఎంపీ పదవి కావాలని తాను ఎవర్నీ అడగలేదని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే బెదిరింపులపై విచారణ షురూ.!

**జర్నలిస్ట్ డైరీ, కడప(ఏప్రిల్ 20):**

రాయలసీమ రాజకీయాలు అదో టైప్. అక్కడ నేతలే ఎవ్రిథింగ్. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఏదైనా జరగాలి. అక్కడ నో రూల్స్. నో చట్టం. ఓన్లీ డిక్టేటర్‌షిప్. కాదూ కూడదు అంటే రక్తచరిత్రనే. దశాబ్దాలుగా అదే తీరు. గతంలో ఫ్యాక్షనిస్టులు ఇలాంటి దందాలు చేసేవారు. ఆ తర్వాత ఫ్యాక్షన్ ఖద్దరు చొక్కా తొడగడంతో.. రాజకీయ నేతలే రాయలసీమను శాసించారు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. చట్టం ఎవరికీ చుట్టం కాదంటోంది. కానీ, ఇప్పటికీ అక్కడక్కడా పాత వాసనలు కనిపిస్తూనే ఉన్నాయి. ఫ్యాక్షన్ మార్క్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఉదంతం కడప జిల్లాలో చర్చనీయాంశమైంది. ఏపీలోనూ రీసౌండ్ వస్తోంది. బీజుపీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కడప జిల్లాలో అల్ట్రాటెక్ సిమెంట్స్‌ను ఎమ్మెల్యే బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. సంస్థలో ప్రతి పనికి సంబంధించిన అన్ని కాంట్రాక్టులను తనకు, తన వారికే ఇవ్వాలని ఎమ్మెల్యే పట్టుబడుతున్నారని అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం ఆరోపిస్తోంది. ఇప్పటికే ఆదినారాయణరెడ్డికి కొన్ని కాంట్రాక్టులు ఇచ్చామని, అన్ని కాంట్రాక్టులు శాసనసభ్యుడుకే ఇవ్వడం సాధ్యం కాదని ఆ సంస్థ చెబుతోంది. ఆయన చెప్పినట్లు చేయకపోవడంతో తమ సిమెంట్ ఫ్యాక్టరీలకు రావాల్సిన ముడి పదార్థాల సరఫరాను ఆదినారాయణరెడ్డి అడ్డుకుంటున్నారని అల్ట్రాటెక్ కంపెనీ అంటోంది.



సిమెంట్ పరిశ్రమలకు లారీలు వెళ్లకుండా వాహనాలు అడ్డుపెట్టి, తన మనుషులను కాపలా పెట్టారని చెబుతోంది.చిలమకూరు ప్లాంట్‌లో సిమెంట్ ఉత్పత్తి ఆగిపోయిందని, యర్రగుంట్ల ప్లాంట్‌లోనూ ఉత్పత్తి ఆగిపోయే పరిస్థితి రావడంతో.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని అల్ట్రాటెక్ వెల్లడించింది. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్.. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు జగదీశ్వర్‌రెడ్డితో సహా పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్స్‌కు ముడి పదార్థాల రవాణా పునరుద్ధరించారు.తనపై వచ్చిన ఆరోపణలపై ఆదినారాయణరెడ్డి స్పందించారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని MLA అన్నారు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని చెప్పారు. స్థానికులకు ఉపాధి దొరుకుతుందనే ఉద్దేశంతోనే గతంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి సహకరించామని గుర్తుచేశారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ తీరుతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని.. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లానని MLA చెబుతున్నారు. విదేశీ పర్యటన నుంచి ముఖ్యమంత్రి తిరిగొచ్చాక స్వయంగా కలిసి పరిస్థితి వివరిస్తానన్నారు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి.

# అమాత్య... యోగం ఎప్పుడు?



- **నాగబాబును మంత్రి పదవి వరించేనా?**

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ(ఏప్రిల్ 20):**

జనసేన నేత నాగబాబుకు మంత్రి పదవి అందనంత దూరంలోనే ఉంది. ఆయనకు అస్సలు మంత్రి పదవి వస్తుందా? రాదా? అన్నది అనుమానం ఇప్పుడు అందరిలోనూ బయలుదేరింది. ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయనకు మంత్రి పదవి వస్తుందని, పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని పవన్ కల్యాణ్ బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారెవరైనా సరే పదవులు వస్తాయని పవన్ అన్నారు. పవన్ కల్యాణ్ చెప్పిన దాని ప్రకారం ఉగాది నాటికే నాగబాబు మంత్రి పదవి లభిస్తుందని చెప్పారు. అయితే ఉగాది వెళ్లిపోయినా ఇప్పటి వరకూ నాగబాబు మంత్రి పదవిపై ఊసే లేదు. పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి సింగపూర్ లో ప్రమాదం జరగడం, తర్వాత ఆయన వెన్ను నొప్పితో బాధపడుతుండటంతో పాటు కొన్ని సమస్యలతో నాగబాబు మంత్రి పదవి మరికొన్నాళ్లు వాయిదా పడినట్లు తెలిసింది. దీంతో పాటు చంద్రబాబు నాయుడు కూడా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి పదిహేడో తేదీ నుంచి ఐదు రోజుల పాటు యూరప్ పర్యటనలో ఉంటారు. చంద్రబాబు తన 75వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకునేందుకు వెళుతున్నారు. దీంతో పాటు వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ పర్యటన అమరావతిలో ఉండనుంది.

అంటే మే మొదటి వారం వరకూ నాగబాబు మంత్రి పదవి గురించి ఆలోచన చేసే అవకాశం ఉండకపోవచ్చు. నాగబాబును పిఠాపురం నియోజకవర్గానికి పంపిన పవన్ కల్యాణ్ అక్కడ పరిస్థితులను చక్కబెట్టాలని భావిస్తున్నారని తెలిసింది. మంత్రి పదవిలో ఉంటే పిఠాపురంలో మరింతగా రాజకీయ ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచన కూడా పవన్ చేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీగా ఉండి పిఠాపురంలో అన్నీ చక్కబెట్టేందుకు నాగబాబు సేవలను ఉపయోగించుకుంటే మంచిదని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు కూడాచెబుతున్నాయి. అందుకే పవన్ కల్యాణ్ కూడా మంత్రి పదవి విషయంలో చంద్రబాబు వద్ద పట్టుబట్టడం లేదని, నిజంగా మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే వెంటనే చంద్రబాబుతో మాట్లాడి గవర్నర్ అపాయింట్ మెంట్ తీసుకుని ప్రమాణ స్వీకారం చేయించేవారంటున్నారు.. కుటుంబంలో ఇద్దరు మంత్రివర్గంలో ఉంటే పార్టీని బలోపేతం చేయడం కుదరదని కూడా పవన్ కల్యాణ్ భావిస్తున్నారని అంటున్నారు. అందుకే నాగబాబుకు పిఠాపురం బాధ్యతలను అప్పగించి తాను జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఉద్దేశ్యంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఏమాత్రం పవన్ కల్యాణ్ కు ఆలోచన ఉన్నా వెంటనే మంత్రి పదవి విషయం చంద్రబాబు వద్ద ప్రస్తావించే వారంటున్నారు. దీంతో పాటు ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిపితే చంద్రబాబుకు కూడా తలనొప్పిగా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వస్తున్న నేపథ్యంలో నాగబాబుకు మంత్రి పదవి ఇప్పట్లో లేనట్లేనన్న ప్రచారం మాత్రం జనసేనలో బాగా వినపడుతుంది.

## బెంగళూరులో మాజీ డీజీపీ
# ఓం ప్రకాశ్ హత్య

- **భార్యపై అనుమానాలు**
- **కుటుంబ కలహాలే కారణమా?**



**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్ 20):**

బెంగళూరులో విషాదకర ఘటన చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఓం ప్రకాశ్ (68) హత్యకు గురయ్యారు. ఈ ఘటన నగరంలోని HSR లేఔట్ ప్రాంతంలో ఉన్న ఆయన నివాసంలో జరిగింది.

ప్రాథమిక సమాచారం ప్రకారం, ఓం ప్రకాశ్ భార్య పల్లవి పైనే పోలీసులకు అనుమానాలు ఉన్నాయి. ఘటన జరిగిన వెంటనే ఆమెతో పాటు వారి కుమార్తెను కూడా పోలీసులు విచారిస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు దారి తీసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఓం ప్రకాశ్ నిబంధనల ప్రకారం పదవీవిరమణ చేసిన తరువాత బెంగళూరులో నివాసం ఉంటున్నారు. ఆయన నిజాయతీగల పోలీస్ అధికారి అనే పేరు సంపాదించారు. ఈ ఘటనతో ఆయన మృతి పట్ల పోలీస్ వర్గాలు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పోలీసులు కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.




## ఎస్సీ వర్గీకరణ...
# వైసీపికి కూటమి దెబ్బ

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ(ఏప్రిల్ 20):**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా చాలా వర్గాలు నిలుస్తూ వచ్చాయి. ముఖ్యంగా ఎస్సీ, ముస్లిం మైనారిటీ వర్గాలు అండగా నిలిచేవి. ఆపై రెడ్డి సామాజిక వర్గం బలంగా నిలవడంతోనే ఇన్ని రోజులు ఆ పార్టీ తట్టుకొని నిలబడుతూ వచ్చింది. అయితే మొన్నటి ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి దారుణంగా ఓడిపోయారు. కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం అయ్యారు. అయితే ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో బలమైన ఉనికి చాటుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. గెలిచిన 11 మంది ఎమ్మెల్యేల్లో.. సగానికి పైగా రిజర్వుడు నియోజకవర్గం నుంచి గెలిచిన వారే. తద్వారా ఎస్సీ సామాజిక వర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఆదరణ చెక్కుచెదరలేదని అర్థమైంది. అయితే ఇకనుంచి ఆ పరిస్థితి ఉంటుందా అంటే అనుమానమే అంటున్నారు విశ్లేషకులు. ఎస్సీ వర్గీకరణ జరగనుండడంతో.. చాలా ఉప కులాలకు లాభం జరగనుంది. అదే జరిగితే మెజారిటీ ఎస్సీలు టిడిపి కూటమి వైపు రావడం ఖాయం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గండిపడడం ఖాయమని తెలుస్తోంది.ఎస్సీల్లోమాలలు, మాదిగలు ప్రముఖ పాత్ర పోషిస్తూ వస్తున్నారు. జనాభాపరంగా ఈ రెండు సామాజిక వర్గాలు అధికం. కానీ ఎస్సీల్లో 59 ఉపకులాలు ఉన్నాయన్న విషయం ఎవరికీ తెలియదు. ఆది నుంచి ఎస్సీలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చారు. తెలుగుదేశం ప్రభంజనంలో సైతం ఎస్సీలు ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తూ వచ్చింది. అయితే 1999లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ విషయంలో ఒక వ్యూహం రూపొందించారు. అప్పటికే మాల సామాజిక వర్గం తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకం. కానీ తెలంగాణలో మాదిగలు అధికం. వారిని రాజకీయంగా ప్రోత్సహించాలని భావించారు చంద్రబాబు. అదే సమయంలో మంద కృష్ణ మాదిగ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలోనే ఎస్సీ వర్గీకరణకు జై కొట్టారు చంద్రబాబు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టారు. దీంతో ఎస్సీల్లో స్పష్టమైన చీలిక కనిపించింది. తెలంగాణలో మాదిగలు టిడిపి వైపు వచ్చారు. అటు తరువాత రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ రద్దయింది. దశాబ్దాలుగా న్యాయపోరాటం జరిగింది. చివరకు సుప్రీం కోర్టు ఆదేశాలతో ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టారు చంద్రబాబు. ఏపీలో కాంగ్రెస్ కుదేలయింది. ఆ స్థానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చింది. దీంతో ఎస్సీలు ఎక్కువగా ఆ పార్టీ వైపు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ పుణ్యమా అని.. చాలా ఉప కులాలు టిడిపి కూటమి వైపు వచ్చే అవకాశం ఉంది. త్వరలో డీఎస్సీ నియామక ప్రక్రియ జరగనుంది. అందులో కూడా ఎస్సీ వర్గీకరణను అనుసరించి రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. అందులో 59 ఉప కులాలు సమానంగా లబ్ధి పొందనున్నాయి. అదే జరిగితే దశాబ్దాలుగా తమకు జరిగిన అన్యాయాన్ని వారు గుర్తించే అవకాశం ఉంది.

ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని గుర్తించుకునే అవకాశం ఉంది. ఒక విధంగా చెప్పాలంటే ఎస్సీ వర్గీకరణ అనేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు. ఏపీలో మాలల సంఖ్య అధికం. ఆ సామాజిక వర్గ జనాభా కూడా అధికం. వారంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు ఎక్కువగా ఉన్నారు. కానీ అదే సమయంలో 59 ఉపకులాల సంఖ్య కూడా అధికమే. రాష్ట్రంలో పార్టీల గెలుపోవటములను వారు శాసించగలరు. అందుకే చంద్రబాబు ఎస్సీల్లో చీలిక తెచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని భావించారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన మరుక్షణం నుంచి పావులు కదపడం ప్రారంభించారు. వడివడిగా అడుగులు వేసి ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు. అయితే ఎస్సీ వర్గీకరణతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరమేనని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# మళ్లీ నెల్లూరుకు అనిల్

- **వైసీపీ అధినేత జగన్ హామీ**

**జర్నలిస్ట్ డైరీ, నెల్లూరు(ఏప్రిల్ 20):**



మాజీ మంత్రి అనిల్ కుమార్ మరోసారి నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది. నెల్లూరు పట్టణ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలిచిన అనిల్ కుమార్ ను 2024 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ నరసరావుపేట ఎంపీగా పంపారు. అప్పట్లో ఎంపీతో పాటు స్థానిక నేతలతో అనిల్ కుమార్ యాదవ్ కు పొసగకపోవడంతో ఆయనను పార్లమెంటుకు పంపాలన్న ఉద్దేశ్యంతో నరసరావుపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా జగన్ నిలబెట్టారు. అయితే గత ఎన్నికల్లో కేవలం మూడు పార్లమెంటు స్థానాల్లోనే గెలవడం, అనిల్ కుమార్ యాదవ్ కూడా ఓటమి పాలు కావడంతో కొన్నాళ్ల నుంచి ఆయన మౌనంగా ఉంటున్నారు. అయితే గత కొద్ది రోజుల నుంచి ఆయన తిరిగి నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తుంది. వరసగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ తో సమావేశమయిన తర్వాత ఆయనకు క్లారిటీ వచ్చినట్లుంది. అందుకే తిరిగి ఆయన నెల్లూరు జిల్లా పాలిటిక్స్ లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. నెల్లూరు జిల్లాలోనే ఎక్కువగా తిరుగుతూ పార్టీ క్యాడర్ ను తిరిగి ఉత్తేజం చేసే ప్రయత్నం అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్నారు. 2024 ఎన్నికల ముందు వరకూ నెల్లూరు జిల్లా వైసీపీకి కంచుకోటగా ఉండేది. కానీ 2024 ఎన్నికల్లో పూర్తిగా ఫ్యాన్ పార్టీ పట్టు కోల్పోయింది. గెలిచే స్థానాల్లో కూడా ఓటమి పాలయింది. ఈ నేపథ్యంలో అనిల్ కుమార్ యాదవ్ ను తిరిగి నెల్లూరు జిల్లాకు పంపాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన మాటలను, ఆహార్యం చూస్తుంటే అర్ధమవుతుంది. నెల్లూరు జిల్లా అనిల్ కుమార్ సొంత ప్రాంతం కావడంతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో అనిల్ ను తిరిగి జిల్లానుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. ఈ మేరకు జగన్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో నెల్లూరు జిల్లాలో తిరిగి పట్టు నిలుపుకునేందుకు అనిల్ కుమార్ యాదవ్ ప్రయత్నిస్తున్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉండగా, అధికారంలో ఉండగా ఫైర్ బ్రాండ్ గా ముద్ర పడిన అనిల్ సేవలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే వినియోగించుకోవాలని డిసైడ్ అయినట్లు తెలిసింది.అయితే మరొక ప్రచారం కూడా విస్తృతంగా జరుగుతుంది. అనిల్ కుమార్ యాదవ్ వెంకటగిరి వైపు పడిందని పెద్దయెత్తున సోషల్ మీడియాలో క్యాంపెయిన్ జరుగుతుంది. అయితే వెంకటగిరిలో ఇప్పటికే ముఖ్యమైన నేత నేదురుమిల్లి రామ్ కుమార్ రెడ్డి ఉండటంతో ఆయనను తప్పించి అనిల్ కుమార్ యాదవ్ ను పంపుతారని అనుకోలేం. ఆయనకు తిరిగి నెల్లూరు టౌన్ నుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు కనపడుతుంది. అనిల్ కూడా తనకు పట్టున్న నెల్లూరు పట్టణం నుంచి తిరిగి పోటీ చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనిపిస్తుంది. ప్రసుతం నెల్లూరు సిటీ,రురల్ కో ఆర్డినేటర్ గా అనిల్ కుమార్ యాదవ్ కొనసాగుతున్నారు. మొత్తం మీద వైసీపీ ఫైర్ బ్రాండ్ మళ్లీ యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తుంది.





# సూడాన్‌లో సంక్షోభం మిగతా ప్రపంచానికి పట్టదా?



సూడాన్ సంక్షోభం, 2023 ఏప్రిల్‌లో ప్రారంభమై మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఈ విపత్తు, ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా మారణహోమంగా నిలిచింది. అయినప్పటికీ అంతర్జాతీయ దృష్టిలో మసకబారుతోంది. సూడాన్ సాయుధ దళాలు (ఎస్.ఏ.ఎఫ్) మరియు ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్.ఎస్.ఎఫ్.) మధ్య జరుగుతున్న దారుణమైన అంతర్యుద్ధం 1.3 కోట్ల మందిని నిరాశ్రయులను చేసింది. లక్షలాది మందిని కరవులోకి నెట్టివేసింది. మరియు దేశ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. ఈ సంపాదకీయం సూడాన్ దుర్గతిని కేవలం స్థానిక సమస్యగా Kiకాక, అంతర్జాతీయ నిర్లక్ష్యం, ఆయుధ సరఫరా సంకీర్ణత, మరియు నిర్ణయాత్మక దౌత్య చర్యల లోపం వల్ల ఏర్పడిన ప్రపంచ వైఫల్యంగా భావించవచ్చు.ఇప్పుడు ప్రపంచం తన పాత్రను గుర్తించి, ఈ విపత్తును అరికట్టడానికి తక్షణం చర్యలు తీసుకోవాలి.

సూడాన్‌లో ప్రజలు బాధల స్థాయి అత్యంత ధారుణమైనది. 3 కోట్ల మంది పైగా జనాభా, దేశంలో దాదాపు మూడింట రెండొంతుల మంది మానవతా సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సంఘర్షణ 93 లక్షల మందిని దేశంలోనే నిరాశ్రయులను చేసింది. అలాగే 25 లక్షల మందిని చాడ్, ఈజిప్ట్ వంటి పొరుగు దేశాలకు శరణార్థులుగా పంపివేసింది. ఇది ఇప్పటికే బలహీనమైన ప్రాంతీయ స్థిరత్వాన్ని కుదిపేస్తోంది. ఆగస్టు 2024లో ఉత్తర డార్ఫర్‌లోని జమ్జమ్ శిబిరంలో కరవు ప్రకటించబడింది, 6.37 లక్షల మంది ప్రమాదంలో ఉన్నారు.అలాగే 2.46 కోట్ల మంది తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య వ్యవస్థ నాశనమైంది, యుద్ధ ప్రాంతాల్లో 80 శాతం ఆసుపత్రులు పనిచేయడం లేదు, లక్షలాది మంది కలరా మరియు తట్టు వ్యాధుల బారిన పడుతున్నారు. స్త్రీలు మరియు పిల్లలు అత్యంత బాధితులు, లింగ ఆధారిత హింస విస్తరిస్తోంది, అలాగే 1.9 కోట్ల పిల్లలు విద్యకు దూరమయ్యారు, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బాలల నిరాశ్రయ సంక్షోభంగా నిలిచింది. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కాదు; అవి అంతర్జాతీయ నిష్క్రియతకు నిందాపూర్వక సాక్ష్యంగా నిలుస్తోంది.

### సంక్షోభానికి మూలాలు

సంక్షోభం మూలాలు సూడాన్ అస్థిర చరిత్రలో, అలాగే 2019లో నియంత ఒమర్ అల్‌బషీర్ తొలగింపు తర్వాత ప్రజాస్వామ్య పరివర్తనను సాధించడంలో విఫలమవ్వడంలో ఉన్నాయి. ఎస్.ఏ.ఎఫ్., ఆరూ.ఎస్.ఎఫ్, ఒకప్పుడు సైనిక తిరుగుబాటులో సహచరులు, అధికారం, వనరుల కోసం, ముఖ్యంగా బంగారు గనుల కోసం పోటీలో శత్రువులుగా మారారు. ఖార్టౌమ్‌లో మొదలైన వారి సంఘర్షణ డార్ఫర్, ఇతర ప్రాంతాలకు వ్యాపించింది, విదేశీ శక్తులు దీనిని మరింత తీవ్రతరం చేశాయి. (యూ.ఏ.ఈ.) రష్యా, చైనా వంటి దేశాలు డార్ఫర్ ఆయుధ నిషేధాన్ని ఉల్లంఘిస్తూ ఆయుధాలను సరఫరా చేస్తున్నాయి. అందుకే యుద్ధాన్ని పొడిగిస్తున్నాయి. ఎస్.ఏ.ఎఫ్., ఆరూ.ఎస్.ఎఫ్ రెండూ సూడాన్ గమ్ అరబిక్ వాణిజ్యాన్ని దోపిడీ చేస్తూ యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటున్నాయి. ఒక కీలక ఎగుమతిని యుద్ధ యంత్రంగా మార్చాయి.

ప్రపంచ నిర్లక్ష్యం సూడాన్ దుస్థితిని మరింత దిగజార్చింది. ఉక్రెయిన్ మరియు గాజా సంక్షోభాలు వార్తలను ఆకర్షిస్తుండగా, సూడాన్ యుద్ధం నీడలోనే ఉంది. ఐక్యరాష్ట్రాల $4.2 బిలియన్ మానవతా నిధి కోసం కేవలం 60 శాతం మాత్రమే సమకూరింది, మరియు 2025లో (యూ.ఎస్.ఏ.ఐ.డీ.) నిధుల ఆకస్మిక ఆపివేత ఖార్టౌమ్‌లో 80 శాతం అత్యవసర ఆహార కిచెన్‌లను మూసివేసింది. జెద్దా చర్చలు మరియు ఆఫ్రికన్ యూనియన్ ప్రయత్నాలు విఫలమయ్యాయి, (ఎస్.ఏ.ఎఫ్), (ఆర్.ఎస్. ఎఫ్.)శాంతి కోసం నిబద్ధత చూపలేదు. 2023లో రమ్తానే లమామ్రాను ఐక్యరాష్ట్రాల ప్రత్యేక రాయబారిగా నియమించడం ఆశాజనకంగా అనిపించినప్పటికీ, అంతర్జాతీయ ఒత్తిడి లేకపోవడంతో మధ్యవర్తిత్వం నిస్సారంగా మిగిలిపోయింది.

### ప్రపంచ మనస్సాక్షికి పరీక్ష

సూడాన్ సంక్షోభం అంతర్గత విషయమని, బాహ్య పరిష్కారానికి చాలా సంక్లిష్టమని విమర్శకులు వాదించవచ్చు. అయితే, విదేశీ ఆయుధాలు, శరణార్థుల ప్రవాహం, అలాగే ప్రాంతీయ అస్థిరత ఈ వాదనను ఖండిస్తాయి. సూడాన్ వ్యూహాత్మక స్థానం, సహెల్, హార్న్ ఆఫ్ ఆఫ్రికా, మరియు ఎర్ర సముద్రాన్ని కలుపుతూ, దాని పతనం విస్తృత అరాచకాన్ని రేకెత్తిస్తుంది. దీనిని అరికట్టడానికి, ఆయుధ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి, మానవతా నిధులను పూర్తిగా సమకూర్చాలి, మరియు ఐక్యరాష్ట్రాలుఆఫ్రికన్ యూనియన్ ద్వారా దౌత్య ఒత్తిడిని పెంచాలి. స్థానిక సూడానీ గొంతుకలను బలోపేతం చేయాలి, అత్యవసర ఆహార కిచెన్‌లను మూసివేయడాన్ని కాకుండా సమర్థించాలి. సూడాన్ సంక్షోభం ప్రపంచ మనస్సాక్షికి పరీక్ష. ప్రపంచ నిశ్శబ్దం దారుణాలను వృద్ధి చేసింది, కానీ ఇప్పటికి చర్య తీసుకోవడానికి సమయం ఉంది. కలిసి బాధ్యత తీసుకోవడం ద్వారా, సూడాన్ తన భవిష్యత్తును తిరిగి పొందవచ్చు. విఫలమైతే, లక్షలాది మంది బాధలతో పాటు మన సామూహిక మానవత్వం యొక్క ఖాళీని బహిర్గతం చేస్తుంది.

**డాక్టర్ బైసెట్టి కవిత,**
**అసిస్టెంట్ ప్రొఫెసర్ (పొలిటికల్ సైన్స్)**
**హన్మకొండ**
**+91 99488 57326**

# తల్లి చేతిలో పతనమైన కూతురు జీవితం!

- **(పుస్తక సమీక్ష - వేర్ లవ్ హేస్ గాన్)**




నాకు అస్సలు నచ్చని సామెతల్లో మొదటిది 'చెడ్డ పిల్లలు ఉంటారేమో కానీ, చెడ్డ తల్లి ఉండదు'. ఇలా generalize చేసి మాట్లాడితే నాకు భలే కోపమొస్తుంది. ఒక వ్యక్తికి ఉండే అనేకానేక పాత్రల్లో తల్లి/తండ్రిగా ఉండడం కూడా ఒక పాత్ర. అది ఎక్కువ శాతం మంది సమర్థవంతంగా, ప్రేమపూరితంగా నిర్వహించినంత మాత్రాన అందరూ అలాగే ఉంటారనుకోవడం అమాయకత్వం. ఒక మనిషి సహజంగానే చెడ్డవారైనప్పుడు వారు నిర్వర్తించే ఇతర పాత్రల్లో కూడా ఈ చెడ్డతనం అనేది ప్రవేశించడం సహజం. కాబట్టీ చెడ్డ తల్లి/తండ్రి ఉండరనుకోవడం నిజం కాదు. నేను చాలామంది తల్లిదండ్రుల్ని పరిశీలించాను. వాళ్ళ పిల్లల జీవితాన్ని వాళ్ళ చేతులారా నాశనం చేసిన వాళ్ళు ఉన్నారు. కొందరు తామే సరైన వ్యక్తులం, తమదే సరైన శైలి అనుకుంటూ మూర్ఖత్వంతో పిల్లల ఆలోచనా విధానాన్ని శాశ్వతంగా నాశనం చేసినవారున్నారు. ఇంకొందరు, పిల్లలపై అతి ప్రేమతో వాళ్ళ జీవితంలో సహజంగా వచ్చే ఇతర వ్యక్తులపై అసూయతో వారి బంధాలను నాశనం చేసినవాళ్ళున్నారు. మొత్తానికి బాధ్యతే తీసుకోకుండా అతి చిన్న వయసు నుండే పిల్లలను పట్టించుకోకుండా వదిలేసి వాళ్ళ భవిష్యత్ ను నాశనం చేసినవాళ్ళున్నారు.

**నేను ఇలా రాసినందుకు బాధపడతారేమో!**

అంతా నేనే, అన్నిటా నేనే, అందరి జీవితాల్లోనూ నేనే ముఖ్య పాత్రని అనుకునే తల్లిదండ్రుల పెంపకంలో ఎదిగిన పిల్లల్ని చూశాను నేను. వాళ్ళ కష్టం అర్థం చేసుకున్నాను. అలాంటి వారు చాలా శాతం bitterగా అయిపోవడం, సరైన వ్యక్తిత్వం లేకపోవడం, మానవత్వం లోపించడం కూడా నేను వారిలో గమనించాను. ఇక అలాంటి పిల్లల జీవిత భాగస్వాములు, వారి పిల్లలు కూడా effect అవ్వడం అదంతా ఒక loop. అందుకే నేను బల్లగుద్ది చెప్పగలను 'చెడ్డ పిల్లలు ఉన్నట్టే, చెడ్డ తల్లిదండ్రులు కూడా లోకంలో ఉంటారు' అని సామెతను మార్చాలి. కొంతమంది నేను ఇంత bluntగా రాసినందుకు బాధపడతారేమో. కానీ నేను చెప్పేది మాత్రం నా జీవితంలో నా కళ్ళెదురుగా చూసిన కటిక సత్యం. నేను ఎప్పుడూ దేవుడికి ఒకటే దణ్ణం పెట్టుకుంటాను. 'నన్ను అన్ని రకాలుగా ఎదగనిచ్చిన తల్లిదండ్రుల చేతిలో పడేసినందుకు ధన్యవాదాలు స్వామీ. నా చేతిలోకి నా పిల్లలు వచ్చినప్పుడు నేను కూడా అలానే ఉండగలిగేలా చూడు'. ఇదే నా ప్రార్థన ఎప్పటికీ. ఎందుకంటే పిల్లల్ని కలిగి ఉండడం, ఒక ప్రాణి పుట్టుక, ఎదుగుదల దగ్గరగా చూస్తు, వారిని ప్రభావితం చేయగలగడం ఒక గొప్ప వరం. అది అర్థం చేసుకోలేనివారికి పిల్లల్ని పెంచే బాధ్యత ఇవ్వడం దేవుడి లీల. వారి కర్మ ఫలం అనిపిస్తుంది నాకు.

**మనం వారి సృష్టికర్తలం కాదు!**

అమెరికన్‌లెబనీస్ ఫిలాసఫర్ కహ్ లిల్ గిబ్రన్ ఒక మాట అన్నాడు. 'Your children are not your children. They come through you but not from you'. ఒక ప్రాణికి ఈ ప్రపంచంలోకి రావడానికి ఒక వాహకం అవసరం కాబట్టీ, వారు కొన్నేళ్ళు మనగలగడానికి ఒక గూడు అవసరం కాబట్టీ, కొన్ని విషయాలు నేర్చుకోవడానికి అనుభవం ఉన్నవారు అవసరం కాబట్టీ మనకి పుడతారు పిల్లలు. వారి కర్మలు, మన కర్మల్ని అనుసరించి, ఎవరికి ఎవరు సరైన జోడీనో ఎంచుకుని, ఆ ప్రాణిని ఈ భూమి మీదకి తీసుకురావడానికి మనల్ని ఒక vehicleగా ఎంచుకుంటాడు దేవుడు అని గట్టి నమ్మకం. అంతేకానీ, మనం వారి creators కాదు. వారిని ఏమైనా చేసేయగల హక్కు మనకి లేదు. ఇలా ఆలోచించని తల్లిదండ్రులు పిల్లల్ని ఆస్తులగానో, తమ నమ్మకాలకు వాహకులుగానో, తమ కోరికలని తీర్చే యంత్రాలగానో, తమ గౌరవాన్ని నిలబెట్టే వ్యక్తులగానో చూస్తారు. అలా చూసిన ఒక తల్లి, తద్వారా జీవితం నాశనమైన ఒక కూతురు కథే 'where love has gone?' నవల. ప్రముఖ ఆంగ్ల నవలాకారుడు హెరాల్డ్ రాబిన్స్ 1962లో రాసిన ఈ నవల ఎన్నో మలుపులతో ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. పక్కా కమర్షియల్ నవల అయిన ఇందులో మనుషుల వ్యక్తిత్వం, అది ఇతరులపై చూపే ప్రభావం వంటి లోతైన విషయాలు ప్రస్తావించారు రచయిత. ఒక self centered తల్లి చేతిలో చిక్కుకుపోయిన కూతురు జీవితం ఎలా పతనమైందో ఈ నవల చదివితే అర్థం అవుతుంది మనకి.

**లోతుగా observe చేసి, అంచనా వేసే అలవాటు**

వీళ్ళందరికన్నా అతి ప్రమాదకరమైన వాళ్ళు వేరే రకం. Self centered, narcissistic వ్యక్తులు తల్లిదండ్రులైతే అంతకన్నా పిల్లలకు నరకం వేరే ఉండదు. సహజంగా ఈ వ్యక్తులు ఏ బంధానికైనా ప్రమాదకారులే, అన్నిటికన్నా ఎక్కువ పిల్లలకు అనే చెప్పాలి. ఎందుకంటే వీళ్ళ దృష్టిలో పిల్లలు వాళ్ళు తయారు చేసిన మట్టిబొమ్మలు. వాళ్ళతో ఎలా అయినా ప్రవర్తించే హక్కు తమకు ఉంది అని వీళ్ల అభిప్రాయం. వీళ్ల ఉద్దేశ్యంలో తామే ముఖ్యం, తమ శరీరమే ముఖ్యం, తమ సౌఖ్యమే ముఖ్యం. మిగిలినవాళ్ళు, సొంత పిల్లలతో సహా ఎవరు ఏమైపోయినా వీళ్లకి అనవసరం. ఇలాంటి వ్యక్తులు కూడా ఉంటారా? ఇలాంటి తల్లిదండ్రులు ఉంటారా? అని మీరు ఆశ్చర్యపోవచ్చు. ఉంటారు అండి, తప్పకుండా ఉంటారు. నాకు ఉన్నవి 32ఏళ్ళే కానీ, నేను నా జీవితంలో చాలా రకాల వ్యక్తులను చూశాను. అదృష్టమో, దురదృష్టమో తారసపడిన వ్యక్తులను లోతుగా observe చేసి, అంచనా వేసే అలవాటు పెట్టాడు నాకు భగవంతుడు. తమ సొంత స్వార్థం కోసం, తమ గొప్ప కోసం పిల్లల కాపురాలు, కెరీర్ లు సర్వనాశనం చేసిన తల్లిదండ్రుల్ని చూశాను నేను. తాము సాధించలేనిదాన్ని పిల్లలపై రుద్ది, వారి మానసిక అనారోగ్యానికి కారణమైన తల్లిదండ్రుల్ని చూశాను నేను.

**- మీనా యోగీశ్వర్**

# అవగాహనతోనే ప్రమాదాలకు అంతం

ప్రతి ఏడాది జాతీయ భద్రతా దినోత్సవం మార్చి 4న నిర్వహిస్తుంటాం. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, ఇలా పలు మతాలతో కూడిన పెద్ద లౌకిక దేశం మనది. చైనా తర్వాత రెండో అత్యధిక జనాభా కలిగిన దేశం ...
అయితే దేశాన్ని ఒకటిగా నిలపడానికి అవాంఛిత సంఘటనలనుండి ప్రజలను రక్షించడానికి అన్నిరక్షణ దళాలు తమ కర్తవ్యంలో ఎల్లప్పుడూ ఉంటాయి. పోలీసులు, కమాండోలు, దేశంలో శాంతి భద్రతలను కాపాడుకోవడంలో ప్రధానపాత్ర పోషిస్తున్న భద్రతా దళాల కృషిని అభినందించడానికి మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రతి వ్యక్తికి దేశం పట్ల వారి వ్యక్తిగత బాధ్యతలు గుర్తుచేయడం ఈ దీని లక్ష్యం.

ప్రమాదాల పట్ల అప్రమత్తత పెంచాలంటే చేయవలసిన ప్రచారంపైన, కార్మికులలో భద్రతపట్ల అవగాహన పెంచడం పైననిర్వహణ కొరకు ప్రభుత్వపరంగా ఒక సంస్థ అవసరమని ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, పలు సంస్థలు పాల్గొన్న ఆ సభలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో భద్రతా మండలి ప్రారంభించారు. అలా 1966, మార్చి 4న జాతీయ భద్రతా మండలి ఏర్పడింది. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860 క్రింద సొసైటీగా నమోదు చేయబడింది.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ భద్రత, ఆరోగ్యం, పర్యావరణ అంశాలను దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరవేయడం, పారిశ్రామిక రంగానికి చెందిన వారినందరినీ ఇందులో భాగస్వాములను చేయడం, భద్రత కల్పించడంలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను అనుసరింప చేయడం లక్ష్యంగా కృషి చేస్తున్నది. జాతీయ భద్రతా మండలి పరిధిలో ఉగ్రవాదం నుండి భద్రత, ఆర్థిక భద్రత, శక్తి భద్రత, పర్యావరణ భద్రత, నేరాలను తగ్గించడం, ఆహార భద్రత, సైబరభద్రత, ఇతర సైనిక రహిత ప్రమాణాలు ఉన్నాయి. జాతీయ భద్రతా ప్రమాదాల పరిధిలోకి ఇతర దేశ రాష్ట్రాలు మాత్ర మే కాకుండా



హింసాత్మక కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల కేసులు, బహుళజాతి సంస్థల చర్యలు కూడా ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలు కూడా జాతీయభద్రతలోకి వస్తాయి. ప్రతి పనిలోను ఏదో ఒక ప్రమాదం జరుగుతుంది. రహదారి ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదా లైనా మానవ నిర్లక్ష్యం వల్ల జరగడం దురదృష్టకరం. క్రమ క్రమంగా ప్రమాదాలసంఖ్య పెరుగుతున్నందున పారిశ్రామిక, రహదారి భద్రతల మీద ప్రత్యేక దృష్టి పెట్టి, ముందస్తు తగు జాగ్రత్తలు పాటించడం వల్ల కొంతైనా ప్రమాదాలను తగ్గించవచ్చు.

అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలో అవగాహన ఉండడం వల్ల మరణాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంది. అందుకే ఈ సందర్భంగా సమావే శాలు, శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, ఉద్యోగులు, కార్మికు లకు ప్రమాదాలు ఎలా జరిగే అవకాశాలు ఉన్నాయి, అవి జరిగినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ జీవన విధానంలో, వృత్తుల్లో భద్రత, ఆరోగ్య రక్షణను ఒక అంతర్గత భాగంగా మలుచుకునేలా చేయడంవల్ల ప్రమాదాలను ఎలా కట్టడికి పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం ముఖ్యం.

**పట్ట హరి ప్రసాద్**
**+91 87908 43009**

# జ్ఞాన జ్యోతికి నెలవు తక్షశిల గ్రంథాలయం



పురాతన నాగరికతల చరిత్రలో భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. జ్ఞానాన్వేషణ, విద్యాభ్యాసం, విశాలదృష్టిని పదిలంగా నిలిపిన నాగరికతగా ఇది ఎన్నో తలాలపై వెలుగొందింది. ఈ క్రమంలో తక్షశిల అనే పట్టణం ఒక అద్భుత జ్ఞాన కేంద్రంగా ఎదిగింది. దాదాపు 2500 సంవత్సరాల కిందట సకల విద్యా శాఖల పుట్టినిలుగా గుర్తింపు పొందిన తక్షశిల విశ్వవిద్యాలయం, ముఖ్యంగా అక్కడి గ్రంథాలయం, భారతీయ విజ్ఞాన పాఠశాలల మహిమను ప్రపంచానికి చాటి చెప్పింది. ఇప్పటి పాకిస్తాన్‌లోని రావల్పిండి సమీపంలో ఉన్న తక్షశిల విశ్వవిద్యాలయం నిజంగా 'యూనివర్సిటీ' అనే పదానికి మించిన బహుళవిద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇది కేవలం విద్యాబోధనే కాకుండా, జ్ఞాన మార్గంలో పరిశోధనలతో శాస్త్రీయ చింతనకు నిలయంగా నిలిచింది. ఈ నగరానికి హృదయంగా ఉన్న గ్రంథాలయం ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన శిష్యులకు ఆదర్శ విద్యా వేదికగా నిలిచింది. వైద్యం, ఖగోళశాస్త్రం, వ్యాకరణం, తత్వశాస్త్రం, రాజనీతిశాస్త్రం వంటి విభిన్న విభాగాల్లో వేలాది గ్రంథాలు, తాళపత్ర గ్రంథాల రూపంలో సేకరించబడ్డాయి.

ఈ గ్రంథాలయ విశిష్టత ఏకకాలంలో రెండు ప్రధాన అంశాల్లో ఉంది. జ్ఞాన పరిమాణంలోనే కాకుండా దాని వ్యాప్తిలోను ఉంది. చరకుని ఆయుర్వేద గ్రంథాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, పాణినియ శబ్దానుశాసనం, భరతముని నాట్యశాస్త్రం వంటి అనేక అపురూప గ్రంథాలన్నీ అక్కడ నిక్షిప్తమై ఉండేవి. హిందూ, బౌద్ధ, జైన గ్రంథాలు అన్నీ అక్కడ సమపాళ్లలో ప్రాధాన్యం పొందాయి. వివిధ దార్శనిక వేదికల మీద పండితుల మధ్య జరిగిన వాద ప్రతివాదాలు, చర్చలు విద్యకు జీవం పోసేవి. తక్షశిలలో గ్రంథాలయం కేవలం పుస్తకాల నిల్వ కేంద్రంగా కాక, జ్ఞాన ప్రయోగశాలగా అభివృద్ధి చెందింది. తక్షశిల విద్యా విధానం అనేక మండలాల్లో శిష్యులకు సమగ్ర విజ్ఞానాన్ని అందించేవి. వైద్య విద్యార్థులకు తత్వశాస్త్రం నేర్పించబడేది. తత్వశాస్త్ర శిష్యులు ఖగోళ విజ్ఞానం అధ్యయనం చేయాల్సి వచ్చేది. ఇలాంటి అంతశాఖా(ఇంటర్ డిసిప్లనరీ అప్రోచ్) విద్యనివ్వడం ఆనాటి నుండే ఉన్నట్లు దీని వల్ల తెలుస్తోంది.విద్యార్థులు సమగ్ర దృక్పథంతో కూడిన పౌరులుగా ఎదిగేవారు. ఇది భారతీయ తత్వాన్ని ప్రతిబింబించే విధంగా, విద్యను వ్యక్తిగత విముక్తికీ, సామాజిక సేవకూ ఉపయోగించాలన్న ఆలోచనకు ఆదర్శంగా నిలిచింది.

**ఇప్పటికీ చైతన్య పరుస్తున్న తక్షశిల**

ఈ గ్రంథాలయం గొప్పతనం ఇందులోని విద్యా స్వేచ్ఛలోనూ ప్రతిఫలిస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శిష్యులకు ఆర్థికంగా సహాయం అందించేది స్థానికులు, పాలకులు. గురుశిష్య సంబంధం ఆధారంగా అభ్యాసం జరిగేది. బ్యూరోక్రటిక్ నియమాలు లేని ఈ పద్ధతిలో స్వేచ్ఛ, స్ఫూర్తి ఉండేది. విద్యా భంగిమను శాసించే యంత్రాంగం కాక, విజ్ఞాన ద్యోతకుల చేతుల్లో విద్య అభివృద్ధి చెందింది. తక్షశిలను ఐదవ శతాబ్దంలో హుణులు లక్షల సంఖ్యలో ఉన్న గ్రంథాలనూ తగలపెట్టడం వల్ల కేవలం ఓ ప్రాంగణం కాదు, ఒక నాగరికతే అంతరించిపోయింది. లక్షలాది గ్రంథాలు అగ్నికి ఆహుతి కావడం ఆనాటి విజ్ఞానం, సంస్కృతి ఏలా ఉంటుందో తెలుసు కొనే అవకాశం పోయింది. ఇది అలెగ్జాండ్రియా లైబ్రరీ విధ్వంసానికి సమానమైన విపత్తుగా పోల్చవచ్చు. కానీ అది ధ్వంసమైనా, తక్షశిల ఆత్మ, దాని విద్యా పరంపర ప్రపంచాన్ని ఇప్పటికీ చైతన్య పరుస్తూనే ఉంది. గ్రంథాలయాల ఉనికి గురించి, వాటి లక్ష్యం గురించి ఈ రోజు మనం ఆలోచించాలంటే, తక్షశిల స్ఫూర్తిగా మారుతుంది.

ఈ కాలంలో గ్రంథాలయాలు డిజిటలైజేషన్, నిధుల కొరత, పఠన అలవాట్ల తక్కువతనంతో బలహీనపడుతున్నప్పుడు తక్షశిల మళ్ళీ మన మనసుల ముందుకు రావాలి. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వగదులు కాదు; అవి ఆలోచనలకు ఆలయాలు. జ్ఞానం ఉచితంగా అందించాల్సిన పవిత్ర బాధ్యతగా గ్రంథాలయాలు పనిచేయాలి. జ్ఞానం అనేది వాణిజ్య వస్తువు కాదు, అది సమాజ సంపద. తక్షశిలను గుర్తుచేసుకోవడం అంటే గడచిన గౌరవనీయుల కాలాన్ని మాత్రమే స్మరించుకోవడం కాదు. అది భావితరాలకు మార్గదర్శనం చూపే ఒక మోడల్‌ను తిరిగి మన ముందు నిలబెట్టడం. విద్యను బంధించకుండా, పటిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో కాకుండా, స్వేచ్ఛతో కూడిన విచారణత్మక ప్రక్రియగా అభివృద్ధి చేయాలంటే తక్షశిల భావనను మన హృదయాల్లో ప్రతిష్టించుకోవాలి. తక్షశిల గ్రంథాలయం కేవలం తాళపత్రాల నిలయం కాదు. అది ఒక జ్ఞాన భాండాగారం. దాని జ్ఞాపకమే మానవతా ప్రగతికి దీపశిఖగా మారాలి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**



# పోలీసు శాఖకు డ్రోన్ అందజేత

**జర్నలిస్ట్ డైరీ, ఏలూరు (ఏప్రిల్ 20) :**

డ్రోన్ లో టెక్నాలజీ వినియోగించి అత్యంత తక్కువ సమయంలోనే నేరస్థులను పట్టుకునేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అవంతి ఫీట్స్ అధినేత ఇంద్ర కుమార్ రూ.8 లక్షల విలువైన అత్యాధునిక డ్రోన్ ను జిల్లా పోలీసు శాఖకు బహూకరించారు. ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు జిల్లా ఆదరణ ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, డిఎస్పీలు శ్రావణ్ కుమార్, వెంకటేశ్వరరావు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.




## 5 కే, 10 కే రన్ ను ప్రారంభించిన గాంధీ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (ఏప్రిల్ 20) :**

అవంతిక కన్స్ట్రక్షన్, ఇగ్నైట్ కళాశాల వారు సంయుక్తంగా తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ ఎడిషన్ మియాపూర్ రన్ 5 కే, 10 కే రన్ నిర్వహించడం చాలా అభినందనీయమని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మియపూర్ లో అవంతిక కన్స్ట్రక్షన్, ఇగ్నైట్ కళాశాల వారు సంయుక్తంగా తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ ఎడిషన్ మియాపూర్ రన్ 5 కే, 10 కే రన్ కార్యక్రమాన్ని కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేశారు. ఈ రన్ ఎంతగానో తోడ్పడుతుందని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని, వృద్ధులు, యువత, చిన్న పిల్లలు పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యము పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమతో మానసిక ఉల్లాసం, ప్రశాంతత చేకూరుతుందని, మారిన జీవన శైలిలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయమం చేయాలని, ఈ రన్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని, ఒక మంచి శుభపరిణామమని తెలిపారు. 5కే, 10కే రన్ కార్యక్రమంలో యువత ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అవంతిక కన్స్ట్రక్షన్ అధినేత, శ్రీనివాస్ రెడ్డి, ఇగ్నైట్ కళాశాల చైర్మన్ రమేష్, కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (ఏప్రిల్ 20) :**

భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో గల వేర్టెక్స్ ప్లెసెంట్, బృందావన్ ఎస్టేట్స్ లో గల శ్రీశ్రీశ్రీ వరసిద్ధి గణపతి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో గల వేర్టెక్స్ ప్లెసెంట్, బృందావన్ ఎస్టేట్స్ లో గల శ్రీశ్రీశ్రీ వరసిద్ధి గణపతి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక స్వామి, మహాలింగేశ్వరస్వామి వార్ల నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనేరు ప్రసాద్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. వరసిద్ధి వినాయక స్వామి, మహాలింగేశ్వర స్వామి వార్ల నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనేరు ప్రసాద్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## మనిషి దాహం తీర్చడమే మానవతా ధర్మం..!

- **చలివేంద్రం ఏర్పాటులో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (ఏప్రిల్ 20) :**

మనిషికి నీటి దాహం తీర్చడమే మానవతా ధర్మమని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ పట్టణంలోని సర్కార్ దవాఖానా వద్ద బీఆర్ఎస్ నాయకుడు కొండ మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. వేసవి కాలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ మానవత్వాన్ని చాటే సేవా మార్గం చలివేంద్రం ఏర్పాటని అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల ప్రజలు తమకు తోచిన విధంగా సామాజిక సేవా కార్యక్రమాలను పాల్గొని తమ మానవత్వాన్ని చాటాలని కోరారు. మండుటెండలో పాదాచారులకు, సర్కారు దావాఖానాకు వచ్చే రోగులకు, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరును అందించడం మంచి పరిణామమని, కొండ మల్లేష్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కానుగు ఆనంతయ్య, నాయకులు చెట్ల జంగయ్య, రంగంపల్లి ఆంజనేయులు, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, జర్పుల సుధాకర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## నల్లమల్లలో అకాల భారీ వర్షం

**జర్నలిస్ట్ డైరీ, నాగర్ కర్నూల్ బ్యూరో (ఏప్రిల్ 20) :**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం నల్లమల్ల ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం బీభత్సం సృష్టించింది. నియోజకవర్గం పరిధిలోని ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర, పొంగూరు తదితర మండలాల్లో వడగండ్లతో కూడిన వర్షం భారీగా కురిసింది. గాలివానతో కూడిన భారీ వర్షం రావడం వలన అమ్రాబాద్ మండల కేంద్రంలో స్తంభాలు విరిగిపోయి నేలకొరిగాయి. తద్వారా అమ్రాబాద్ మండల వ్యాప్తంగా అంతట కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పై మండలంలో మాధవాని పల్లి, ఉప్పునుంతల, తిరుమలాపూర్, అమ్రాబాద్, మాచారం, మొలకమామిడి, మున్ననూరు తదితర గ్రామాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం పడింది.

# "బాబు" సుదీర్ఘకాలం ప్రజాసేవలో ఉండాలి

- **టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు**
- **రామేశ్వరం దేవాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేరిట అర్చన, అభిషేక పూజలు**
- **హాజరైన షాద్ నగర్ టిడిపి శ్రేణులు**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (ఏప్రిల్ 20) :**




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో సుదీర్ఘకాలం ప్రజాసేవలో తరించాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు కోరారు.వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టడంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆద్యులైన 75 ఏళ్ల చంద్రబాబు జన్మదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని పరమ పవిత్ర మహిమానిత్వమైన శ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి రామేశ్వరం దేవాలయంలో బక్కలి నరసింహులు ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున అర్చన అభిషేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో దేవాలయంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కనీ నర్సింలు మాట్లాడుతూ.. చంద్రబాబు జీవితంలో దాదాపు 47 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారనీ, సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన 28 ఏళ్లకే తొలిసారి ఎమ్మెల్యే అయ్యారన్నారు. 30 ఏళ్ల వయసులో మంత్రి అయ్యారనీ ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో చంద్రబాబు పాలనలో తన ప్రత్యేకత చాటుకున్నారనీ రైతు బజార్లు, జన్మభూమి, ఈసేవ, ఇంటర్‌లో మూడు ప్రశ్నపత్రాల విధానం, ఇంజనీరింగ్ కాలేజీల పెంపు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్.. ఇలా ఎన్నో సేవలు గుర్తుకొస్తాయనీ తుఫాన్లు, విపత్తుల వేళ సీఎం హోదాలో క్షేత్రస్థాయిలో మకాం వేసి పరిస్థితులు చక్కదిద్దిన తీరు ఆయన పాలనాదక్షతకు నిదర్శనం అన్నారు. పాలనలో తనదైన మార్క్ వేసిన ఆయన రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారనీ ప్రజల కోసం జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. తెలుగు ప్రజల సేవ కోసమే పుట్టిన చంద్రబాబు ప్రజా సేవలో సుదీర్ఘకాలం సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రత్యేక పూజలు పాల్గొన్న వారిలో మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, బూర్గుల కుమార్ గౌడ్, గంధం ఆనంద్, అనుమారి వెంకటయ్య, బాబు నాయక్, అనంతయ్య భాస్కర్ గౌడ్, యాదగిరి, శంకరయ్య, మేడిగ శ్రీనివాస్ జనార్ధన్ శ్రీను, బక్కని జగన్ సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో త్వరలో ఎకో టౌన్



- **జపాన్‌తో ప్రభుత్వం ఒప్పందం**
- **నగరానికి పెరగనున్న మౌలిక సదుపాయం**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (ఏప్రిల్ 20):**

హైదరాబాద్ నగరంలో త్వరలోనే "ఈకో టౌన్" ఏర్పాటు కాబోతుంది. వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, పునరుద్ధరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం జపాన్‌తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో పర్యావరణ అనుకూలమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి జపాన్‌కు చెందిన కిటాక్యూషూ నగర మేయర్‌తో సమావేశమయ్యారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో కలిసి పని చేయాలని ప్రతిపాదించారు. కిటాక్యూషూ మేయర్ కూడా భారత్-జపాన్ సంబంధాలను మరింత బలపరచేందుకు, హైదరాబాద్ నుంచి జపాన్‌కు నేరుగా విమాన సేవలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌ను అభ్యర్థించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో జపనీస్ స్కూల్ ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. జపాన్‌తో ఉన్న భాగస్వామ్యాన్ని విద్య, సాంకేతిక రంగాలకు విస్తరించాలని పేర్కొన్నారు.

ఈ ఒప్పందంతో హైదరాబాద్ పర్యావరణహిత నగరంగా మారేందుకు ఒక కొత్త దిశగా అడుగులు వేస్తోంది. జపాన్ అనుభవాన్ని ఉపయోగించుకుని, వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందడుగు వేయనుంది.



## పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై కత్తితో దాడి

- **అక్కడికక్కడే యువకుడు మృతి**

**జర్నలిస్ట్ డైరీ, నాగోల్ (ఏప్రిల్ 20) :**

పాత కక్షల నేపథ్యంలో యువకుడిని వెనుక నుంచి వచ్చిన ముగ్గురు కత్తితో పొడిచి చంపారు. ఈ సంఘటన నాగోల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ నాగోల్ కు చెందిన మనోజ్ (21), సంజయ్ (27)లకు మధ్య గత 2023 లో గొడవ జరిగింది. ఈ విషయంలో సంజయ్ మనోజ్ పై పగ పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్య రాత్రి 1.50 గంటల ప్రాంతంలో మనోజ్ నాగోల్ ఫ్లైఓవర్ యూటర్న్ దగ్గర ఉన్న రాజుగారి బిర్యాని హోటల్ ముందు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న మొబైల్ సైకిల్ టిఫిన్ బండిపై కూర్చొని తింటుండగా అదే సమయంలో సంజయ్, మరో ఇద్దరితో కలిసి దాడికి పాల్పడ్డాడు.



ఈ ఘటనలో మనోజ్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పసికందుని కాపాడిన.. దిశా పటానీ సోదరి

- **మానవత్వం చాటుకున్న సెలబ్రిటీ**
- **వైరల్ అవుతున్న ఫోటోలు**


**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్ 20):**

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో ఓ మానవతా ఘటన వెలుగుచూసింది. పాడుబడిన భవనంలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన ఓ పసికందును ప్రముఖ బాలీవుడ్ నటి దిశా పటానీ సోదరి ఖుష్బూ పటానీ అత్యంత ధైర్యసాహసాలతో రక్షించారు. గాయాలతో ఏడుస్తున్న చిన్నారిని గుర్తించి, గోడ దూకి మరీ కాపాడటం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

వివరాల్లోకి వెళితే, బరేలీలోని తమ నివాసం సమీపంలో ఖుష్బూ పటానీ ఆదివారం ఉదయం నడకకు వెళ్లారు. ఆ సమయంలో దగ్గరలోని పాడుబడిన భవనం నుంచి పసికందు ఏడుపులు వినిపించాయి. అనుమానంతో అక్కడికి చేరుకున్న ఆమెకు ఆ భవనంలోకి నేరుగా ప్రవేశించే మార్గం కనిపించలేదు. అయినా వెనక్కి తగ్గకుండా, ధైర్యంగా ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించారు.

భవనం లోపల నేలపై పడి ఉన్న సుమారు 10 నెలల వయసున్న పసికందును ఖుష్బూ గుర్తించారు. చిన్నారి ముఖంపై గాయాలు ఉండటంతో పాటు, నిస్సహాయ స్థితిలో ఏడుస్తూ కనిపించింది. వెంటనే చలించిపోయిన ఖుష్బూ, చిన్నారిని జాగ్రత్తగా తన ఇంటికి తీసుకెళ్లారు. ఇంట్లో పాపకు ప్రథమ చికిత్స అందించారు. ఖుష్బూ తన తండ్రి, రిటైర్డ్ పోలీసు సర్కిల్ ఆఫీసర్ అయిన జగదీశ్ పటానీతో కలిసి బరేలీలోని నివాసంలో ఉంటున్నారు.

అనంతరం వారు ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, చిన్నారిని మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారికి ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.





ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. "పసికందును అంత నిర్దాక్షిణ్యంగా ఎవరు వదిలివెళ్లారనేది గుర్తించేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నాం. బాధ్యులైన వారిని త్వరలోనే పట్టుకుంటాం" అని సర్కిల్ ఆఫీసర్ (సిటీ1) పంకజ్ శ్రీవాస్తవ మీడియాకు వివరించారు. ఖుష్బూ పటానీ చూపిన చొరవ, ధైర్యాన్ని ఆయనతో పాటు స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

# అభిమానానికి కృతజ్ఞతలు

- **భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత**
- **పేదలను స్వర్ణ కుటుంబాలుగా మార్చాలి**
- **సీఎం చంద్రబాబు కామెంట్స్**

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్,( ఏప్రిల్ 20):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు తన 75వ పుట్టినరోజును ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా జాతీయ స్థాయి నేతలు, కూటమి నేతలు, టీడీపీ కార్యకర్తలు, సాధారణ ప్రజలు భారీగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అందరి ప్రేమకు, అభిమానానికి స్పందనగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. "మీ అభిమానం, శుభాకాంక్షలతో నా హృదయం ఉప్పొంగింది. 75 ఏళ్ల జీవితం, 47 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మీ అందరి సహకారం విలువైనది.



నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని అపూర్వ గౌరవంగా భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.

తన జన్మదినాన్ని పురస్కరించుకుని చంద్రబాబు ప్రజల పట్ల తన భద్రమైన సంకల్పాన్ని తెలియజేశారు. తెలుగు జాతి అభ్యున్నతికి పునరంకితమవుతానని, “స్వర్ణాంధ్ర 2047” విజన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలో శ్రేష్ఠ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు.

**అతను చెప్పిన ముఖ్యమైన అంశాలు ఇవీ:**

ప్రతి పౌరుడి భవిష్యత్తుకు భరోసా కలిగించేలా పాలన అందిస్తానని హామీ

- పీ4 కార్యక్రమం ద్వారా పేదలను స్వర్ణ కుటుంబాలుగా మార్చాలన్న ఆశయం
- అసమానతలు తగ్గించాలన్న సంకల్పం
- అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం
- 'థింక్ గ్లోబల్లీ యాక్ట్ లోకల్లీ' సిద్ధాంతంతో రాష్ట్రాన్నినాలెడ్జ్ఎకానమీగామలచాలన్నదృక్పథం
- ప్రపంచవ్యాప్తంగా తెలుగువాళ్ల విజయాలు గర్వకారణంగా మారుతున్నాయని భావన
- 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలో శక్తిమంతమైన జాతిగా నిలిపేందుకు కృషి
- చివరిగా, పల్లెల నుంచి ప్రపంచ దాకా తమ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలకూ, నాయకులకూ, అభిమానులకూ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## ప్రయాణిస్తున్న బైక్ కు ఒక్కసారిగా మంటలు

- **తగలబడి యువకుడు మృతి, మరొకరికి గాయాలు**

**జర్నలిస్ట్ డైరీ, నాగర్ కర్నూల్ బ్యూరో (ఏప్రిల్ 20) :**

శ్రీశైలం హైదరాబాద్ నెహ్రూ జాతీయ రహదారి 765 పై ఆదివారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో విషాదాన్ని నింపింది. ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయాలకు గురయ్యాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెహదీపట్నం కు చెందిన ఇద్దరు యువకులు జునేద్ (32), ఇమ్రాన్ (24) లు శ్రీశైలం జలాశయం చూడడానికి వెళ్తున్నారు. వంగూర్ సమీపానికి రాగానే వారు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ ఒక్కసారిగా పేలిపోయి మంటలు వ్యాపించాయి. తప్పించుకోవడానికి ప్రయత్నించిన జునేద్ తీవ్రగాయాలతో గాయపడి పరిస్థితి విషమించి మృతి చెందాడు. తోటి సహచరుడు ఇమ్రాన్ కు సైతం తీవ్ర గాయాలవడంతో 1033 జాతీయ రహదారి అంబులెన్స్ లో అత్యవసర చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.



## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని విస్తృతం చేయాలి

- **రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**జర్నలిస్ట్ డైరీ, నాగర్ కర్నూల్ బ్యూరో (ఏప్రిల్ 20) :**

మహాత్మా గాంధీ, అంబేద్కర్ ను గౌరవించుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ను జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమమని, ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఆదివారం కొల్లాపూర్ లోని క్యాంప్ కార్యాలయంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోన్ని ప్రతి గ్రామంలో పాదయాత్రలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలిసికట్టుగా విచ్చేసి కార్యాచరణలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.




## టీటీడీలో ప్రారంభమైన అన్యమతస్థుల బదిలీ ప్రక్రియ

**జర్నలిస్ట్ డైరీ, తిరుపతి (ఏప్రిల్ 20) :**

టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్తుల బదిలీలు శనివారం ప్రారంభించారు. అన్యమతస్థులు ఆధ్యాత్మిక, ధార్మిక, విద్యాక్షేత్రాల్లో కాకుండా ఇతర విభాగాలలో పనిచేయాలని నిర్ణయించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు మొదటి పాలక మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. టీటీడీ తీర్మానం మేరకు 47మంది అన్యమతస్తుల గుర్తించారు. టీటీడీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న అసుంతను నరసింగాపురంలోని ఆయుర్వేద ఫార్మసీకి బదిలీ చేస్తూ టీటీడీ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన వారిని కూడా త్వరలో బదిలీ చేయనున్నట్లు సమాచారం.

## నెగ్గిన అవిశ్వాసం

**జర్నలిస్ట్ డైరీ, విశాఖపట్నం (ఏప్రిల్ 20) :**

ఎట్టకేలకు కూటమి నేతలు అవిశ్వాస తీర్మానాన్నినెగ్గించుకున్నారు. మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇటీవలే చాలామంది వైసీపీ కార్పొరేటర్లు పార్టీకీ రాజీనామా చేయడంతో కూటమి బలం అనూహ్యంగా పెరిగింది. జీవీఎంసీలో మొత్తం 97 మంది కార్పొరేటర్లు ఉండగా.. సమావేశానికి 74 మంది కూటమి సభ్యులు హాజరై వారు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో మేయర్పై కూటమి నేతలు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు



# పుస్తకం ఆవిష్కరణ

- **సీఎం బర్త్ డే స్పెషల్**
- **అసెంబ్లీలో మీటింగ్**

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్ 20):**



ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా అసెంబ్లీ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు దూరదృష్టి అనేది ఎంతటి రాజకీయ ప్రత్యర్థులు అయినా గౌరవించక తప్పదన్నారు. భవిష్యత్తును ముందుగానే ఊహించి కార్యాచరణ రూపొందించే ఆయన శైలి, నిజమైన 'టైమ్ ట్రావెలర్'లాగా ఉందని అభివర్ణించారు.

మహాత్మా గాంధీ ఓర్పు, సుభాష్ చంద్రబోస్ విప్లవోపేతత - ఈ రెండూ చంద్రబాబులో సమపాళ్లలో దర్శనమిస్తాయన్నారు. అవసరమైనప్పుడు విప్లవ ధోరణి చూపగల శక్తి ఆయనలో ఉందని, అయితే మామూలుగా ఓర్పు, శాంతమే ఆయన ప్రాతినిధ్యం వహించే లక్షణాలనన్నారు. విదేశాల్లో ఉన్నా రాష్ట్ర పరిపాలనపై వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా పర్యవేక్షణ చేస్తారని, ఆయన పనితీరు ఎప్పటికప్పుడు అపూర్వమైందన్నారు.

చంద్రబాబుతో కలిసి పనిచేసే అవకాశం ఆలస్యంగా వచ్చినా, అది తనకు లభించడంపై గర్వంగా ఉందని తెలిపారు. విజనరీ నాయకుడిగా ఆయన అందరికీ ఆదర్శమని, ఆయన తత్వాన్ని అర్థం చేసుకున్న వారెవ్వరైనా విజయవంతంగా ఎదగగలరని పేర్కొన్నారు.

చంద్రబాబు సమయపాలనపై తొలుత తనకు చిన్న సందేహం వచ్చినా, తర్వాత ఆయన సమయాన్ని ఎందుకు మించి ఖర్చుపెడతారో అర్థమైందని రఘురామ తెలిపారు. చిన్నవారి అభిప్రాయాలను కూడా గౌరవంగా వినే ఆయన, నిజమైన నిత్య విద్యార్థి అని కొనియాడారు. అలాంటి నాయకుడి వల్ల కొంతమందికి తాత్కాలికంగా ఇబ్బంది అయినా, రాష్ట్రానికి దీర్ఘకాల ప్రయోజనం జరుగుతుందన్నారు.

చివరిగా, చంద్రబాబు నాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆశయాలు సాకారమవాలని ఆకాంక్షించారు.

# దక్షిణ తెలంగాణకు వర్ష సూచన

- **వాతావరణ శాఖ హెచ్చరిక**
- **అలర్ట్ గా ఉండాలని సూచన**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ ( ఏప్రిల్ 20):**





దక్షిణ తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయే అవకాశముంది. ప్రస్తుతం ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

రాబోయే కొన్ని గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అంచనా. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో వర్ష సూచనలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వాతావరణం మేఘావృతమై ఉండగా, అక్కడక్కడా చిరుజల్లులు కూడా ప్రారంభమయ్యాయి. వర్షాలతో పాటు ఈదురుగాలులు కూడా దాటవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. గాలులు సుమారు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. రైతులు, ప్రయాణికులు, నగరప్రాంతాల్లో నివసించే వారు వాతావరణ మార్పులపై దృష్టి పెట్టాలని వాతావరణ శాఖ సూచించింది.

# మహాకుంభ్ ఓ రాజకీయ కుట్ర

- **మతం, కులం పేరుతో సమాజాన్ని బీజేపీ విభజిస్తోందని విమర్శలు**
- **అందుకోసం పక్కా ప్రణాళికతో నిధులు కూడా ఖర్చు చేస్తోందని ఆరోపణ**

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్ 20):**



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను భవిష్యత్ ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రజల ముందుకు తీసుకురావడంలో భాగంగానే బీజేపీ మహా కుంభమేళాను ఉపయోగించుకోవాలని కుట్ర పన్నిందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ మతం, కులం పేరుతో సమాజంలో చీలికలు సృష్టించేందుకు పక్కా ప్రణాళికతో నిధులు ఖర్చు చేస్తోందని కూడా ఆయన విమర్శించారు.

### రాజకీయ కుంభ్‌గా మార్చే యత్నం

"మహా కుంభమేళా సమయంలో యోగి ఆదిత్యనాథ్ పేరును ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలనేది వారి (బీజేపీ) ప్రణాళిక అని మాకు తెలిసింది. వారు దీనిని రాజకీయ కుంభ్‌గా మార్చాలని కోరుకున్నారు. ఇది మతపరమైన కుంభ్ కాదు" అని అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. "నిజానికి మతాల మధ్య చిచ్చు పెడుతున్నది ఎవరైనా ఉన్నారంటే అది బీజేపీనే. మతం, కులం పేరుతో సమాజంలో విభజన సృష్టించడం బీజేపీ చాలా ప్రణాళికాబద్ధంగా చేస్తున్న కార్యక్రమం, దాని కోసం వారు నిధులు కూడా ఖర్చు చేస్తారు. ఇప్పుడు చెప్పినదంతా బీజేపీ ఆలోచనా విధానమే" అని అఖిలేశ్ వివరించారు.






# మా బడి.. అమ్మ ఒడి

- **చదువులమ్మ నీడలో**
- **సేదతీరిన పూర్వ విద్యార్థులు**
- **ఉద్వేగభరితంగా న్యూ తక్షశిల హై స్కూల్ గెట్ టు గెదర్**

**జర్నలిస్ట్ డైరీ, ఎల్బీ నగర్(ఏప్రిల్ 20):**



మురిసిపోయిన క్షణాలు.. ఒడిసిపట్టుకున్న జ్ఞాపకాలు.. కాలం పంచిన అనుభవాలతో వారంతా తడిసిముద్దయ్యారు. రెండు దశాబ్దాల క్రితం బడిని విడిచి వెళ్లినప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ, తమ గురువుల పాదాలను తాకి ఉద్వేగానికి గురయ్యారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న ఉపాధ్యాయుల మాటలను అనునిత్యం గుర్తు చేసుకుంటున్నామని, అవే నేడు తమ ఎదుగుదలకు మార్గాలయ్యాయని చెబుతూ గుండె తడిని కన్నీటి జడిగా మార్చుకున్నారు.

ఇదంతా న్యూ తక్షశిల హై స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చోటచేసుకుంది. ఎల్బీ నగర్‌లోని ఈ పాఠశాల దాదాపు నాలుగు దశాబ్దాలుగా విద్యారంగంలో విశేష సేవలు అందిస్తోంది. ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి నేతృత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చదువులమ్మ నీడగా మారి తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. ఈ బడిలో 200405 మధ్య పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పలువురు 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్క చోటికి చేరారు. బడి బాధ్యతల నుంచి పక్కకు తప్పుకుని, విశ్రాంతి తీసుకుంటున్న తమ గురువులను మళ్లీ ఒక వేదికపైకి చేర్చారు. వారిని కనులారా చూసుకుని మురిసిపోయారు. ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, వారి సతీమణి గీత, టీచర్లు సావిత్రి, నాగమణి, పద్మావతి, వెంకటలక్ష్మి, కృష్ణకుమారి, నిర్మల, శ్రీనివాస్, సైదులు, శ్రీకాంత్ తదితరుల మాటలను మరోసారి వింటూ సంబరపడిపోయారు. ఒకనాడు క్లాస్ రూమ్ పాఠాలను విన్న పూర్వ విద్యార్థులు ..నేడు జీవిత పాఠాలను వింటూ తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

విద్యార్థులు తమ తమ వృత్తులను, ప్రస్తుత జీవన గమ్యాలను ఒక్కొక్కరుగా చెబుతూ ఉంటే వేదికపై నున్న టీచర్లంతా తమ శిష్యుల ఎదుగుదలను చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. గురువుల ఆశీస్సులే నేటి తమ విజయాలకు కారణమంటూ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమం విజయంతం కావడంలో తమకు సహకరించిన ప్రిన్సిపల్ నారాయణ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ పిలుపు మేరకు దూరభారాలను లెక్క చేయకుండా విచ్చేసిన టీచర్లకు పాదాభివందనాలు చేశారు. గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో అనూష, సౌజన్య, విజయ లక్ష్మి, జ్యోతి, కవిత, డాక్టర్ ప్రసన్న, దేవి, అనూరాధ, గీతాంజలి, స్వప్న, శిరీష, శ్రీను, అనిల్, విద్యాకర్, పవన్ శర్మ, పృథ్వీరాజ్, నరసింహ, సురేశ్, రయీజ్, జవహర్, మురళీ, కరుణాకర్, నరేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.



## చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీ

**జర్నలిస్ట్ డైరీ, కాకినాడ (ఏప్రిల్ 20) :**

పలు కారణాలతో చోరీకి గురై లేదా పోగొట్టుకున్న 454 మొబైల్ ఫోన్లను కాకినాడ జిల్లా పోలీసులు రికవరీ చేసి తిరిగి వాటిని బాధితులకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అందజేశారు. సుమారు రూ.77 లక్షల విలువ చేసే 454 సెల్ ఫోన్లను కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశంహాల్లో మొబైల్ ఫోన్ బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. రికవరీ చేసిన సెల్ ఫోన్లతో కలిపి మొత్తం 2551 సెల్ ఫోనలను రికవరీ చేశామని, మరో నెలలో మరో 600 వరకు బాధితులకు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సైబర్ మోసాల నుండి రక్షణ కోసం వీడియో కాల్స్, ఫోన్ కాల్స్కు స్పందించవద్దని సైబర్ నేరగాళ్ళ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలన్నారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ భాస్కరరావు, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ డీఎస్పీ మనీష్, దేవరాజ్ పాటిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుల్ మండి తింటే భారీ నగదు బహుమతి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (ఏప్రిల్ 20) :**



భోజన ప్రియులను ఆకట్టుకునేందుకు పలు హోటల్స్, రెస్టారెంట్లు సరికొత్త కాన్సెప్ట్ తో ముందుకు వస్తున్నాయి. గిస్మత్ జైలు మండి రెస్టారెంట్ లో మండి ఛాలెంజ్ నిర్వహిస్తున్నామని నిర్ణీత సమయంలోగా ఫుల్ మండి తిని.. నగదును గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గిస్మత్ మండి రెస్టారెంట్ లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మండిలోని అన్ని ఆహార పదార్థులు తిని గెలుపొందిన వారికి రూ.15 వేల నగదును అందజేయనున్నట్లు వారు వెల్లడించారు.



## జై శ్రీ రామ్ వైభవేష్ఠిని విజయవంతం చేయండి

- **మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి**

**జర్నలిస్ట్ డైరీ, మంథని (ఏప్రిల్ 20) :**

మంత్రపురి వేదికగా తలపెట్టిన జై శ్రీ రామ్ వైభవేష్ఠి నేపథ్యంలో స్వర్ణార్చన ప్రక్రియగా కలం గళంలతో భక్త కోటి సహకరించి విజయవంతం చేయాలని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి కోరారు. శనివారం మంథని విద్యార్థి యువత కార్యాలయంలో గోడపత్రికలను భగవద్గీత ప్రవచన కారిణి కొంజెర్ల ఉషారాణి శ్రీకాంత్ దంపతులు ఆవిష్కరించారు. జై శ్రీరామ్ నామం పదకొండు కోట్ల పదకొండు లక్షల పదకొండు వేల పదకొండు వందల పదకొండు అక్షరాలు లిఖించే కార్యక్రమం రానున్న అక్షయ తృతీయ ప్రారంభమవుతుందని కొండేల మారుతి తెలిపారు. కలం గళం స్వరుపాల ప్రతి పాదికగా కార్యాచరణ సంసిద్ధమౌతున్న జై శ్రీ రామ్ మహయాగంలో అనేకులు పాల్గొనాలని ఆయన కోరారు. ఇందుకు అనుసంధానంగా మంత్రపురి హిందూత్వ శ్రేష్ఠ వర్ధని వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. కలం గళం విశిష్ట రూపికల జైశ్రీరామ్ సముహంను వంద పదహారు దంపతులతో ఏర్పాట్లు చేస్తున్నామని సోమవారం సాయంత్రం నిర్వహించే సమవేశంలో భక్త కోటి పాల్గొనాలని మారుతీ కోరారు. ఈ సమావేశంలొ మంథని విశ్వ హిందు పరిషత్ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, మేడగోని రాజమౌళి గౌడ్, గట్టు నాగన్న, తాటి బుచ్చయ్య గౌడ్, బెజ్జంకి దిగంబర్, నారమల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మేడేను జయప్రదం చేయాలి..!

- **139 వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే జయప్రదం కోసం విస్తృత ఏర్పాట్లు**

**జర్నలిస్ట్ డైరీ, దేవనకొండ (ఏప్రిల్ 20) :**

ప్రపంచ కార్మికుల దినోత్సవం 139వ మే డే ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు ఎమ్.కృష్ణమూర్తి, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎస్.బడేసాహెబ్ లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టర్నింగ్ లో గల ఏఐటీయూసీ కార్యాలయంలో హమాలీ సంఘం అధ్యక్షుడు బి.గంగన్న అధ్యక్షతన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఆటో యూనియన్ జిల్లా నాయకులు బడే సాహేబ్ హాజరై మాట్లాడుతూ.. ప్రపంచ కార్మికుల దినోత్సవం 139వ మేడేను ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు, కర్షకులు అందరూ పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని, ఆశ, అంగన్వాడీ మధ్యాహ్న భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మేడేను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, నరేష్, గోపాల్, లష్మణస్వామి, రామస్వామి, మల్లీ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు విద్యార్థులకు అండగా నిలిచారు

- **సీఎం బాబు ఎంతో మందికి**
- **ఫీజులు కట్టారు, ఆదుకున్నారు**
- **కేంద్ర మంత్రి పెమ్మసాని**

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ ( ఏప్రిల్ 20):**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఓ ఆసక్తికర విషయం వెల్లడించారు. అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఎందరో తెలుగు విద్యార్థులకు చంద్రబాబు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులను ఆయన స్వయంగా ఆదుకున్నారని పేర్కొన్నారు.

ఈ విషయాన్ని చర్చిస్తూ పెమ్మసాని అన్నారు, "ఇది చాలామందికి తెలియదు. కొన్ని సందర్భాల్లో ఒకరిద్దరికి మాత్రమే తెలిసేలా ఈ సహాయాన్ని చేశారు. ఎంతోమందికి ఆయన ఫీజులు కడతారు. ఇది చంద్రబాబు గారి దయగుణానికి, విద్యార్థుల పట్ల ప్రేమకు అద్దం పడుతోంది."

చంద్రబాబు రాజకీయ నాయకుడే కాకుండా, ఎందరో విద్యార్థుల జీవితాల్లో మార్గదర్శిగా నిలిచారని ఆయన కొనియాడారు. ప్రత్యేకించి అమెరికాలో ఆర్థిక ఇబ్బందులతో చదువు నిలిచిపోయే పరిస్థితి వచ్చినప్పుడల్లా చంద్రబాబు వెంటనే స్పందించి ఫీజులు చెల్లించేలా చూసేవారని తెలిపారు.

అంతేకాకుండా, చంద్రబాబును "నిలువెత్తు నిఘంటువు"గా (Living Dictionary) అభివర్ణించిన పెమ్మసాని, "ఆయన దూరదృష్టి, విజన్ నుంచి నేను ఎన్నో నేర్చుకున్నాను. అమెరికాలో స్థిరపడేటప్పుడు ఆయన ప్రసంగాలు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి," అని చెప్పారు.

అమరావతి నిర్మాణం, 'జన్మభూమి' వంటి సామాజిక కార్యక్రమాలు, ఔటర్ రింగ్ రోడ్ (ORR) వృద్ధి వంటి బృహత్తర ప్రాజెక్టులలో చంద్రబాబు చూపిన దార్శనికతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేంద్రం 70 మీటర్ల వెడల్పును అనుమతిస్తే, భవిష్యత్ అవసరాల దృష్ట్యా దానిని 140 మీటర్లకు పెంచాలని చంద్రబాబు పట్టుదలగా కృషి చేశారని, ఈ విషయంలో అర్ధరాత్రి ఒంటిగంటకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో సమావేశమై ఒప్పించారని గుర్తు చేశారు.

చంద్రబాబు జన్మదిన సందర్భంగా ఆయన్ను ప్రశంసిస్తూ, ఆయన ప్రసంగాల సంకలనంగా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించేందుకు ఏపీ అసెంబ్లీ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెమ్మసాని, తన అనుభవాలను పంచుకుంటూ పై వ్యాఖ్యలు చేశారు.

## పంట కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు

- **రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (ఏప్రిల్ 20) :**



యాసంగి పంట కొనుగోలు రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సన్న బియ్యం సరఫరా ధాన్యం కొనుగోలు పై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల ఇన్చార్జ్ ఆర్డిఓ రాదాబాయితో కలిసి ఇల్లంతకుంట తహశీల్దార్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని, వానాకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగి లో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పండిందని అన్నారు. వానాకాలం పంట కొనుగోలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు కలెక్టర్లకు, అదనపు కలెక్టర్ లు, పౌర సరఫరాల అధికారులకు, ఇతర సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. వాన కాలం కంటే అదనంగా యాసంగి సీజన్ లో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 241 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని, మొత్తం 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నామని తెలిపారు. జిల్లాలో 36 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉండగా, ఒక్కరు మాత్రమే బ్యాంక్ గ్యారంటీ ఇచ్చారని, మిగతావారు ఇచ్చేలా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రైస్ మిల్లర్లు ముందుకు రాకపోతే ప్రత్యామ్నాయంగా గోదాములలో రైతుల ధాన్యం నిలువ చేస్తామని తెలిపారు.

## భూ భారతి చట్టం అమలుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి

- **టీపీసీసీ సీనియర్ నాయకులు కోమిరెడ్డి కరంచంద్**

**జర్నలిస్ట్ డైరీ, మెట్ పల్లి (ఏప్రిల్ 20) :**




తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి చట్టం క్షేత్ర స్థాయి అమలుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని టీపీసీసీ సీనియర్ నాయకులు కోమిరెడ్డి కరంచంద్ పిలుపునిచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ప్రజలకు, రైతులకు శాపంగా పరిణమించిందని, అప్పటి ప్రభుత్వ లోప భూయిష్టమైన విధానాలతో రైతులు కొత్త పాసుబుక్కులు పొందలేక పోతున్నారని, పాసుబుక్కులు ఉన్న రైతులు రిజిస్ట్రేషన్లకు నోచుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొమిరెడ్డి కరంచంద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతితో కొత్త శకం మొదలైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో తెలంగాణ యావత్ రైతాంగానికి ప్రధాన సమస్యగా మారిన ధరణి పోర్టల్ ను రద్దుచేసి, భూభారతి చట్టం అమల్లోకి తేవడం పై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, ఇందుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండల కేంద్రాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులు, ప్రజలతో కలసి సంయుక్తంగా వీలైనన్ని సమీకృత సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. భూ భారతి చట్టంపై సంబంధిత రెవెన్యూ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆయా చట్టం యొక్క గెజిట్ రూల్స్ ను ప్రజలకు వివరించడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేకే ఈడీ, ఐటీ రైడ్లు

- **న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలపై స్పందించాలి**
- **-మాజీ ఎంపీ చింతామోహన్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (ఏప్రిల్ 20) :**



హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టల విషయంపై కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా స్పందించాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ తో కలిసి మాట్లాడారు. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయినా యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్లకట్టల ఆరోపణలు దేశం మొత్తం అలజడి సృష్టించినా ఈడి,ఐటి ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థులపై సాధారణ వ్యక్తులపై ఈడిని ఐటీని ప్రయోగిస్తున్న కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.500 కోట్లకు పైగా నోట్లు కాలిపోయినట్లు ఆరోపణలు వచ్చిన విషయంపై ఎందుకు మిన్నకున్నారని ప్రశ్నించారు. ఏ స్థాయిలో అవినీతి జరిగితే ఆ స్థాయిలో నోట్ల కట్టలు బయటపడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై ప్రత్యేక దృష్టిసారించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిత్యం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేకే రాజ్యాంగబద్ధ సంస్థలను అక్రమంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం తన తీరు మార్చుకొని ప్రజలకు మంచి పాలన అందించాలని కోరారు.



## కుష్బూ సుందర్ అకౌంట్ హ్యాక్

- **ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సహాయానికి విజ్ఞప్తి**
- **ఐడీ, పాస్‌వర్డ్ పనిచేయడంలేదు**

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్ 20):**

ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు కుష్బూ సుందర్ సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్ ఘటనతో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తన ట్విట్టర్ (ప్రస్తుతం ఎక్స్‌గా మారిన) ఖాతా హ్యాకింగ్‌కు గురైందని, దానిని తిరిగి పొందేందుకు సహాయం చేయాలని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులకు, అనుచరులకు అత్యవసరంగా విజ్ఞప్తి చేశారు.

ఈ సంఘటనతో ఆమె అభిమానులు, ఫాలోవర్లలో ఆందోళన ఏర్పడింది. ప్రస్తుతానికి ఖుష్బూ ట్విట్టర్ ఖాతాలో విదేశీ భాషలో పలువురు నకిలీ ట్వీట్లు కనిపిస్తున్నాయి.

ఈ విషయాన్ని వెల్లడిస్తూ కుష్బూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సందేశాన్ని పోస్టు చేశారు. "నా ట్విట్టర్ ఖాతా హ్యాక్ అయ్యింది. దాన్ని ఎలా తిరిగి పొందాలో ఎవరికైనా తెలిస్తే దయచేసి చెప్పండి. ఇది అత్యవసరంగా చేయాల్సిన పని," అని ఆమె పేర్కొన్నారు. గత తొమ్మిది గంటలుగా తన ఖాతాలోకి లాగిన్ కావడానికి ప్రయత్నిస్తున్నానని, కానీ ఫలితం లేకపోయిందని చెప్పారు.

"నా ఐడీ, పాస్‌వర్డ్ పనిచేయడంలేదు. ఎన్నిసార్లు ప్రయత్నించినా లాగిన్ కావడం సాధ్యపడడం లేదు. ఖాతాలోకి ప్రవేశించలేక పోవడం వల్ల నేను ఎలాంటి పోస్టులు పెట్టలేకపోతున్నాను, అప్‌డేట్ చేయడం కూడా వీలుకావడం లేదు," అని ఆమె వివరించారు.

తన ఖాతాను తిరిగి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నానని తెలిపారు. అయితే తన ఖాతా నుంచి ఎవరైనా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే, దయచేసి తన దృష్టికి తీసుకురావాలని కోరారు. "ఇంతవరకూ నేను ఇన్‌స్టాగ్రామ్ వేదికలో అందుబాటులో ఉంటాను" అని వెల్లడించారు. ఆమె ఈ పోస్టు చేసిన కొద్దిసేపటికే అది వైరల్‌గా మారింది. అనేకమంది అభిమానులు, అనుచరులు ఆమెకు మద్దతు తెలుపుతూ, ఖాతా తిరిగి పొందేందుకు పలు సూచనలు చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఇటీవలే మరోసారి చోటు చేసుకున్నాయి. కొద్ది రోజుల క్రితమే నటి త్రిష ట్విట్టర్ ఖాతా కూడా హ్యాకింగ్‌కు గురైంది. ఆ సమయంలో క్రిప్టోకరెన్సీకి సంబంధించిన నకిలీ ప్రచార పోస్టులు ఆమె ఖాతా నుంచి ప్రచురించబడ్డాయి. ఇప్పుడు ఖుష్బూ ఖాతా కూడా హ్యాకర్ల చేతికి చిక్కడంతో, ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాల భద్రతపై మరోసారి సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రస్తుతం ఖుష్బూ తన ఖాతాను తిరిగి పొందే పనిలో నిమగ్నమై ఉన్నారు. అప్పటి వరకూ ఆమె ట్విట్టర్ ఖాతా నుంచి వచ్చే ఏ అనుమానాస్పద ట్వీట్లనైనా జాగ్రత్తగా పరిశీలించాలని అభిమానులకు సూచించారు.

## ఇవాళ ఇండియాకు రానున్న అమెరికా ఉపాధ్యక్షుడు



**జర్నలిస్ట్ డైరీ, డెస్క్, (ఏప్రిల్ 20):**

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇవాళ భారత పర్యటనకు వస్తున్నారు. జేడీ వాన్స్ ఈ పర్యటనకు కుటుంబ సమేతంగా వస్తుండడం విశేషం. జేడీ వాన్స్ అర్థాంగి ఉష భారత సంతతి మహిళ అని తెలిసిందే.

జేడీ వాన్స్ సోమవారం నాడు ఢిల్లీలోని పాలం ఎయిర్ పోర్టులో దిగనున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడికి ఘన స్వాగతం పలికేందుకు భారత వర్గాలు సిద్ధమవుతున్నాయి. జేడీ వాన్స్ కు కేంద్ర కేబినెట్ సీనియర్ మంత్రి స్వాగతం పలుకుతారని తెలుస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన భారత్ లో నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆయన భారత్ లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

జేడీ వాన్స్ కుటుంబం భారత్ లో పలు చారిత్రక ప్రదేశాలను సందర్శించనుంది. రేపు జేడీ వాన్స్ ఢిల్లీలోని స్వామినారాయణ్ అక్షర్ ధామ్ ఆలయాన్ని సందర్శించనున్నారు. దేశ రాజధానిలోని పలు చేనేత ఉత్పత్తుల దుకాణాలను సందర్శించనున్నారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు వాన్స్ ప్రధాని మోదీ నివాసానికి చేరుకోనున్నారు. అమెరికాభారత్ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని మోదీతో చర్చలు జరపనున్నారు. చర్చలు ముగిసిన అనంతరం జేడీ వాన్స్ఉష దంపతులకు మోదీ విందు ఇవ్వనున్నారు.

వాన్స్ దంపతులు ఎల్లుండి (ఏప్రిల్ 22) జైపూర్ లోని పలు చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు. ఈ నెల 23న ప్రఖ్యాత తాజ్ మహల్ ను సందర్శించనున్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



# 'ఏమాయ చేసావె'.. యాక్టింగ్ చూస్తే సిగ్గుగా అనిపిస్తుంది: సమంత

ప్రేక్షకులకు మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను అందించాలనే లక్ష్యంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు నటి సమంత. ఆమె నిర్మాతగా వ్యవహరించిన తొలి చిత్రం 'శుభం'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ సినిమాలో ప్రధాన నటీనటులందరూ కొత్తవారే అని చెప్పిన ఆమె.. వారి యాక్టింగ్ తనని ఎంతో కదిలించిందన్నారు. భవిష్యత్తులో వారందరూ ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరుకున్నారు.

''తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కంటెంట్‌కు పెద్ద పీట వేస్తారు. మంచి కథ ఉన్న చిత్రాలను వారు ఆదరిస్తుంటారు. మనసుని హత్తుకునే కంటెంట్‌తో సిద్ధమైన మా చిత్రాన్నీ వారు ఆదరిస్తారని కోరుకుంటున్నా. నటీనటులందరూ కొత్తవారే అయినప్పటికీ.. అద్భుతంగా యాక్ట్ చేశారు. వారి నటన నాకెంతో నచ్చింది. నటిగా నా కెరీర్ మొదలుపెట్టినప్పుడు యాక్టింగ్ గురించి పెద్దగా తెలియదు. నేను నటించిన మొదటి రెండు చిత్రాలను ఇప్పుడు చూస్తే చాలా సిగ్గుగా అనిపిస్తుంది. దారుణంగా యాక్ట్ చేశాననే ఫీలింగ్ వస్తుంది. ఇంకా బాగా నటించవచ్చు కదా అనిపిస్తుంది. కానీ వీళ్లు అలా కాదు. తొలి సినిమానే అయినప్పటికీ యాక్టింగ్ బాగా చేశారు'' అని సమంత చెప్పారు. నిర్మాతగా మారడంపై మాట్లాడుతూ.. జీవితంలో సవాళ్లను స్వీకరించడం తనకు ఇష్టమని ఆమె అన్నారు. నిర్మాతగా ఇదొక కొత్త ప్రయాణమని తెలిపారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమే 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఇది నిర్మితమైంది. మే 9 ఈ సినిమా విడుదల కానుంది.

# ఈ యుద్ధంలో గొప్పవారిదే గెలుపు

తెరపై ప్రత్యేక పాటలతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తూనే.. మరోవైపు కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'హై జునూన్'. నీల్ నితిన్ ముఖేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మ్యూజికల్ డ్రామాకు అభిషేక్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్‌ను అధికారికంగా ప్రకటిస్తూ.. విడుదల తేదీని పంచుకుంది సిరీస్ బృందం. ''మొండితనం.. ప్యాషన్‌ల మధ్య జరిగే యుద్ధంలో గొప్పవారు మాత్రమే గెలుస్తారు'' అని వ్యాఖ్యల్ని జోడించింది. రెండు మ్యూజిక్ క్లబ్‌ల మధ్య పోటీ చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. జియో క్రియేటివ్ ల్యాబ్స్ ప్రొడక్షన్ నిర్మించిన ఈ సిరీస్‌లో సిద్ధార్థ్ నిగమ్, సుమేద్ ముద్గల్కర్ తదితరులు నటిస్తున్నారు. మే 16న రానుంది






# దుమ్ములేపిన కోహ్లీ... పంజాబ్ ను చిత్తు చేసిన ఆర్సీబీ

ఐపీఎల్ 2025 టోర్నమెంట్ లో (IPL 2025) భాగంగా ఇవాళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ( RCB) వర్సెస్ పంజాబ్ కింగ్స్ ( PBKS) జట్ల మధ్య మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్ లో ఎవరు ఊహించని విధంగా ఆడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు గ్రాండ్ విక్టరీ కొట్టింది. మొన్నటి వరకు పెద్దగా ఫామ్ లో లేని విరాట్ కోహ్లీ ( Virat Kohli) కూడా రెచ్చిపోయి ఆడి జట్టును గెలిపించాడు. ఈ నేపథ్యంలోనే ఏకంగా ఏడు వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్ జట్టును చిత్తు చేసింది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు.

ఇక ఈ మ్యాచ్ లో ఓపెనర్ గా బరిలోకి దిగిన ఫిలిప్ సాల్ట్ ( Salt ) ఒక పరుగు చేసి నిరాశపరచగా... ఆ తర్వాత వచ్చిన విరాట్ కోహ్లీ అలాగే పడిక్కల్ అద్భుతంగా రాణించారు. పడిక్కల్ ఈ మ్యాచ్లో 35 బంతుల్లో 61 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సిక్సర్లతో పాటు ఐదు బౌండరీలు ఉన్నాయి. ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగిన ఇతను... 174 స్ట్రైక్ రేటుతో రఫ్ఫాడించాడు. ఆ తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ 12 పరుగులు చేశాడు. చివరలో జితేష్ శర్మ సిక్సర్ కొట్టి మ్యాచ్ ను గెలిపించాడు. ఇక కోహ్లీ ఈ మ్యాచ్ లో 54 బంతులల్లో 73 పరుగులు చేసాడు. దీంతో పంజాబ్ కింగ్స్ పైన ఏడు వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు. సొంత గ్రౌండ్ చిన్నస్వామి స్టేడియంలో... వరుసగా ఓడిపోతున్నప్పటికీ... ప్రత్యర్థి గ్రౌండ్ లో మాత్రం దుమ్ము లేపుతోంది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.





# చెన్నై చిత్తు.. ముంబయి హ్యాట్రిక్ విజయం

ఐపీఎల్ 18 (IPL) లో ముంబయి ఇండియన్స్ (Mumbai Indians)కు హ్యాట్రిక్ విజయం. చెన్నై సూపర్ కింగ్స్ (Chennai super Kings)తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత సీఎస్కే (CSK) నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబయి (MI) 15.4 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. రోహిత్ శర్మ (76*), సూర్యకుమార్ యాదవ్ (68*) అర్ధశతకాలతో విరుచుకుపడ్డారు. వీరి ధాటికి 177 పరుగుల లక్ష్యం చిన్నబోయింది. ముంబయికిది నాలుగో విజయం కాగా, చెన్నైకిది ఆరో ఓటమి.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై.. రవీంద్ర జడేజా (53*), శివమ్ దూబే (50) హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. నాలుగో ఓవర్ తొలి బంతికే రచిన్ రవీంద్ర (5) పెవిలియన్ చేరాడు. అశ్వనీ కుమార్ బౌలింగ్‌లో కీపర్ రికెల్‌టన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. గాయం కారణంగా రుతురాజ్ గైక్వాడ్ మ్యాచ్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో బరిలోకి దిగిన 17 ఏళ్ల ఆయూష్ మాత్రే (32: 15 బంతుల్లో 4 ఫోర్లు 2 సిక్స్‌లు) భారీ షాట్లతో అలరించాడు. అయితే ఏడో ఓవర్ చివరి బంతికి చాహర్ బౌలింగ్‌లో శాంట్నర్‌కు చిక్కాడు. ఆ తర్వాత శాంట్నర్ బౌలింగ్‌లో షేక్ రషీద్ (19) స్టంపౌట్ అయ్యాడు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465